



# విషాద యాత్ర

- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- కార్ టైర్ పేలి డివైడర్‌ను ఢీకొట్టిన వైనం
- అక్కడికక్కడే ముగ్గురు మృతి
- బిక్కవోలులో విషాదఛాయలు



అనకాపల్లి వద్ద టైర్ పేలి ప్రమాదానికి గురైన ఎర్టిగా కారు..





ప్రమాదంలో మృతిచెందిన తోడికోడళ్లు సత్యవతి, కుమారి, మనవడు అభిరామ్

బిక్కవోలు, జనవరి 19 : దేవుడిని చూద్దామని వెళ్లి.. ఆ దేవుడి దగ్గరికే వెళ్లిపోయిన విషాద ఘటన ఇది.. బిక్కవోలు జువ్వలదొడ్డిలో నివాసం ఉంటున్న సోదరులు పోలిరెడ్డి సత్తిబాబు, శ్రీను షూమార్ట్ వ్యాపారం చేస్తున్నారు. పండుగ పూర్తయిన ఆనందంలో వీరిద్దరు కుటుంబీకులతో ఎర్టికా కారులో బుధవారం పలు ఆలయాలను దర్శించుకునేందుకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున అరసవిల్లి, శ్రీకూర్మం, సింహాచలం దైవ దర్శనాలు చేసుకుని తిరిగి వస్తుండగా అనకాపల్లి ఎక్స్‌ప్రెస్ రోడ్డు వద్ద కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న సత్యవతి(48), కుమారి (35), అభిరామ్ (3) అక్కడికక్కడే మృతి చెందారు. నిన్నటి వరకూ తమ మధ్యనే ఆనందంగా తిరుగుతూ కనిపించిన తోటికోడళ్లు, మనవడు ఇక లేరని తెలిసి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- వివరాలు మెయిన్‌లో..



## జై..శ్రీరామ్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఏవీ అప్పారావు రోడ్డు రామాలయం సెంటర్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం శ్రీరామ విజయయాత్ర నిర్వహించారు. బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ సత్యగోపీనాథ్ ప్రభూజీ సారథ్యంలో దానవాయిపేట నుంచి ఆల్‌కట్ గార్డెన్స్ శ్రీ గేదెల నూకరాజు కల్యాణ మండపం వరకూ యాత్ర సాగింది. యాత్రలో శ్రీరామనామ సంకీర్తనలతో పురవీధుల్లో ప్రజలు తన్మయత్వంతో పులకించారు. గరగలు, డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాట బృందాల భజనలు, కేరళ చండై వాయిద్యాలు, పౌరాణిక వేషధారణతో కళాకారులు సందడి చేశారు. యాత్రలో యాత్ర కన్వీనర్ తోట సుబ్బారావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, ఏపీఆర్ చౌదరి, అడబాల రామకృష్ణ, కాలెపు సత్యసాయిరాం, కె.హారిక, పొన్నాల సంతోషి, యానాపు యేసు, ఆదిరాజు సత్యనారాయణ, రామభక్తులు తదితరులు పాల్గొన్నారు.



దూబచర్లలో జరిగే బహిరంగ సభపై చర్చిస్తున్న టీడీపీ నాయకులు జవహర్, మందలపు రవి, బీవీఆర్ చౌదరి, మద్దిపాటి తదితరులు

## 27న దూబచర్లకు చంద్రబాబు రాక

### లక్ష మందితో రా..కదలిరా బహిరంగ సభ

రాజమహేంద్రవరం,జనవరి19(ఆంధ్రజ్యోతి)/ కోరుకొండ : గోపాలపురం నియోజకవర్గం పరిధి నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో ఈ నెల 27న తెలుగుదేశం పిలుస్తుంది రా..కదలిరా.. భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్.జవహర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హాజరవుతారన్నారు.కోరుకొండ మండలం బూరుగుపూడిలోని రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో జరిగే సభకు జిల్లా నుంచి అత్యధికంగా పార్టీ కార్యకర్తలు, నేతలు, తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రా కదలిరా బహిరంగ సభలకు భారీగా జనం తరలి వస్తున్నారని.. ఈ సభకు కూడా జిల్లా నుంచి లక్ష మందికి పైగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివస్తారని అంచనా వేశారు. 27న ఉదయం 9 గంటలకే సభ ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే దూబచర్లలో సభా వేదిక స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి సభకు జనం హాజరవుతారన్నారు.దీనికి సంబంధించి భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభకు అనుమతులు, ఏర్పాట్లు, రూట్, పార్కింగ్ ప్లేసులు, హాజరయ్యే జనానికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు తదితర అంశాలపై నేతలు చర్చించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జోన్-2 ఇన్‌చార్జి మందలపు రవి, రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్.చౌదరి, గోపాలపురం ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ చౌదరి పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు జగన్‌కెక్కడిది..

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19: అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు సీఎం జగన్‌కు లేదని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా దళితులను దగా చేసిన జగన్ ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావిడిగా అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రారంభిస్తున్నాడన్నారు. ఇక అభ్యర్థులను మారుస్తున్న జగన్‌నే ప్రజలు మార్చబోతున్నారని చెప్పారు. గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ దళితులు జగన్ పాలనలో మరొక 40 ఏళ్ల వెనక్కి పోయారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన 26 పథకాలను జగన్ నిర్వీర్యం చేశాడని మండిపడ్డారు. నా ఎస్సీలు అని పదేపదే చెప్పే జగన్ పూర్తిగా దళితుల సంక్షేమాన్ని విస్మరించాడన్నారు. ఇప్పుడు అతని పార్టీలో ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత వల్ల ఎక్స్ఛేంజ్ ఆఫర్ మాదిరిగా నియోజకవర్గాలు మారుస్తున్నాడన్నారు.ఒక చోట పనికిరానివాడు మరొక నియోజకవర్గంలో ఎలా పనికి వస్తాడని ప్రశ్నించారు.



రాజమహేంద్రవరంలో ఉపాధ్యాయుల నిరసన ర్యాలీ

## ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

### 24న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరంలో నిరసన ప్రదర్శన చేశారు. గోకవరం బస్టాండు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రాజ్యాంగం అమలయ్యేలా చూడాలని నినాదాలు చేశారు. కంబాలచెరువు పార్కు సెంటర్లో చెవిలో పువ్వులు, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బాకీ ఉన్న రూ.18 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయకపోతే ఈ నెల 24న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ రాజమహేంద్రవరంలోనే రిలే నిరాహారదీక్షలు చేస్తామని వెల్లడించారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 25న విజయవాడలో ధర్నా చేపడతామన్నారు. జిల్లా కోశాధికారి ఎస్ఆర్ ప్రసాద్, రూపస్, జిల్లా కార్యదర్శులు రవిబాబు పాల్గొన్నారు.

# బరివెక్కిన.. గుండెలు!




- ప్రతి ఏడాదీ ఓడిపోతోన్న పుంజు
- బరిలో ప్రాణాలు బలిపెడుతున్న వైనం
- ఏడాదంతా ప్రేమగా పెంచి చివరిలో ఇలా
- మూగజీవాలపై యజమానుల కర్కశత్వం
- జిల్లాలో ఈ ఏడాది 100 బరులు
- 2 వేల పుంజులు బలైనట్టు సమాచారం
- గ్రామాల్లో పలువురు మహిళల మనోవేదన

నిన్నటి వరకూ మా మధ్యనే తిరిగింది.. చాలా చలాకీగా ఉండేది.. ఏం పెట్టినా తినేసేది.. ఇంటికి కాపలాగా ఉండేది.. ఎవరినీ ఇంటిలోకి రానిచ్చేది కాదు. గత నాలుగు రోజులుగా కనిపించకపోతే ఏదో వెలితి.. ఏం చేయాలో తోచడం లేదు.. ఇదీ ఒక పెద్దావిడ ఆవేదన..

తెల్లవారుజామునే మమ్మల్ని అందరినీ లేపేది.. ఎవరైనా లేవకపోతే మా చుట్టూ తిరిగేది.. పెట్టింది తిని మా మధ్యలో మసలేది. నాలుగు రోజులుగా ఎప్పుడు తెల్లారిందో తెలియడం లేదు.. ఎటు చూసినా అదే గుర్తొస్తుంది.. దాని కాలికి కట్టే తాడు కూడా అక్కడే ఉంది. ఏ లోకాన ఉందో పాపం.. ఇదీ ఒక మధ్య తరగతి మహిళ ఆక్రందన..

ఈ రెండు సంఘటనలు గోదావరి జిల్లాల ప్రేమను తెలియజేస్తున్నాయి కదా.. అవును మరి.. ఏడాదంతా ఎంతో ప్రేమగా పెంచుతారు.. సంక్రాంతి వచ్చిందంటే చాలు బలి జీవులుగా మార్చేస్తారు.. అవేనండి మన పందెం పుంజులు.. ప్రేమగా చూసినంత సేపు అంతే ప్రేమగా దగ్గరకు వస్తాయి.. యజమాని ఆదేశిస్తే బరిలో దిగుతాయి.. ఆ కోట్లాటలో అయితే విజయం లేదంటే వీరస్వర్గం.. ఇటీవల జరిగిన కోడి పందేల్లోనే సుమారు 2 వేల పుంజుల వరకూ మృత్యువాత పడినట్టు సమాచారం. ఆ పుంజుల యజమానులు నేటికి 'బరి'వెక్కిన గుండెలతో కన్నీటిని కంటిచాటున అదిమిపట్టుకుని ఆ పుంజుల జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చెట్లకు ప్రాణం ఉంటుందనేది పర్యావరణ ప్రేమికులు చెప్పే మాట.. అందుకే చెట్ల ఆకులను కోయడానికి ఇష్టపడరు..అలాంటిది తమ సరదా లకు చాలా మంది జీవం ఉన్న ప్రాణులను బలిస్తున్నారు. సంక్రాంతి పండుగ సరదా మాటున వేలాది మూగజీవాలు ప్రతి ఏడాదీ బరికి బలైపోతున్నాయి. వాటిని కావలి కాయడానికి ఎన్ని చట్టాలు ఉన్నా మూడు రోజులు మాత్రం మూగనోము పాటిస్తున్నాయి. ఆదేశాలు ముఖం చాటేయగా.. యంత్రాంగం కళ్లకు పాలకులు గంతలు బిగించేయడంతో ఏడాదంతా రాజభోగం చూసినా.. మూడు నిమిషాల్లో కత్తి వేటుకు రక్తం చిందించడం హింసా సంప్రదాయంగా మారిపోయింది. ఈ ఏడాదీ అదే జరిగింది. వారం ముందు నుంచీ బరులను ధ్వంసం చేయడం, కోడి పందేలపై పోలీసులు జూలు విదల్చడంతో ఈ సారి తమ ప్రాణాలకు ముప్పు లేదని పందెం పుంజులు సంబరపడ్డాయి. కానీ యథావిధిగా యుద్ధానికి వెళ్లి ప్రాణార్పణ చేయడం తప్పలేదు. ఇంటి వద్ద నుంచి ఠీవిగా వెళ్లిన పుంజు తిరిగి కుటుంబం చెంతకు చేరుకోలేదు.

### కత్తి కట్టిన హింసా సంప్రదాయం..

కోడి పందేల చరిత్ర ఈనాటిది కాదు. శాతవాహనుల కాలం నుంచీ ఈ క్రీడ వినోదాన్ని అందించేది. కావ్యాల్లో కూడా కోడి పందేలపై వర్ణన ఉంది. తొలిసారిగా కేతన తన దశ కుమార చరిత్రలో ఈ పందేలను ప్రస్తావించాడు. కోడి పుంజుల జాతి వైరం అనాదిగా మనుషుల పౌరుషాలకు ప్రతీకగా మారడం కాలక్రమేణా వాటి జాతికి ముప్పు తెచ్చింది. ప్రతి ఏడాదీ వేలల్లో కోడి పుంజులు ప్రాణాలు కోల్పోతున్నాయి. వాస్తవానికి కోడి కాలుకు కత్తి కట్టే పద్ధతి వచ్చిన నాటి నుంచే సరదా కోడి పుంజుల ఆట హింసాక్రీడగా మారి పోయి జూదం స్థాయికి చేరిపోయింది. పూర్వం డింకీ పందేల వల్ల పుంజుల ప్రాణాలకు పెద్దగా నష్టం ఉండేది కాదు. వాస్త వానికి కోడి పందేలు అటు పల్నాడు, ఇటు బొబ్బిలి ప్రాంతాల్లో పౌరు షానికి ప్రతీకగా నిలిచేవి. ఇప్పుడు సంక్రాంతి వచ్చిందంటే కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల్లోని వేలాది బరుల్లో లక్షలాది పుంజుల రక్తం ఏరులవుతోంది. 1178-1182 మధ్య జరిగిన పల్నాడు యుద్ధానికి కోడి పుంజులే కారణమని చరిత్ర చెబుతోంది. నాగమ్మతో కోడి పందెంలో ఓడిన బ్రహ్మనాయుడు ఏడేళ్ల పరదేశంలో ఉండాల్సి వచ్చింది. ఇద్దరు మనుషులు లేదా రెండు ఊళ్ల మధ్య వచ్చిన వైరాలను కూడా కోడి పుంజుల జాతి వైరం తీర్చేది. అప్పట్లో గెలుపునకే ప్రాధాన్యం ఇచ్చేవాళ్లు. కత్తి కట్టేవారు కాదు.దీంతో సమస్య పరిష్కారం అయ్యేది. మూగజీవాల ప్రాణాలకు ఇబ్బంది ఉండేది కాదు. గురజాల, మాచర్ల మధ్య గొడవను కోడి పందేలే తీర్చాయని చరిత్ర చెబుతోంది. రాజులు, జమిందారులు, సంస్థానాధీశులు వేడుకకు కోడి పందేలను నిర్వహించేవారు. సాధారణ ప్రజానీకం వినోదాన్ని మాత్రమే ఆస్వాదించేవాళ్లు. కోడికి కత్తి కట్టడం, వాటిపై డబ్బులతో పందేలు కాయడం వంటివి ఉండేవికావు. రానురాను కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశాలకు కూడా ఈ పందేలు పాకాయి.




### 'బలి' జీవులు..

పందెం పుంజుకు ఏడాది పాటు రాజభోగం చూపిస్తారు. రోజూ వాటిని సాకడానికి ప్రత్యేకంగా పనోళ్లను ఏర్పాటు చేస్తారు. జీడిపప్పు, బాదం, చోళ్లు, గంట్లు, మేకమాంసం తదితర పదార్థాలతో తయారు చేసిన ఆహారాన్ని అందిస్తారు.గస(ఆయాసం) రాకుండా ఈత కొట్టిస్తారు. వేడి ఆవిరి పడతారు. నోటిలో నీళ్ల వేసుకొని వాటి ముఖంపై చిమ్మి హుషారు రప్పిస్తారు.మధ్య మధ్యలో మజాకు మందు పట్టిస్తారు.ఏడాదంతా ఎంతో ప్రేమగా సాకుతారు. అదే జీవితం కింద ఉంటారు. పండుగ వచ్చిందంటే పందెం పేరుతో బరిలో మూడు నిమిషాల్లో వాటి ప్రాణాలను తీసేస్తారు. ఏ కోడి పుంజు అయినా చావాల్సిందే.పందెం ఓడిపోయిన పుంజు ప్రాణాలు కోల్పోతుంది. ఒకవేళ బతికినా ఒంటినిండా దారుణమైన కత్తి పోట్లు ఉంటాయి. గెలిచిన పుంజుదీ అదే పరిస్థితి.ఒక పందెం కాకపోతే మరో పందెంలోనైనా పుంజు ప్రాణాలు తీసే వరకూ పందెంగాళ్లకు మన సు ఊరుకోదు. సంప్రదాయం మాటున జరుగుతున్న ఈ హింసా క్రీడపై జనాలు చైతన్యం కావాలని.. మూగజీవాలను హింసించి చంపేస్తూ ఆనంద పడడం క్రూరత్వమేనని జంతు ప్రేమికులు అంటున్నారు.

### మూగ జీవాలకూ అనుబంధం

క్రూర జంతువులైన సింహం, పులి కూడా వాత్సల్యం చూపిస్తే మచ్చిక అవుతాయి. మూగ జీవాలకూ ప్రేమానుబంధాలు తెలుసనడానికి అలాంటి ఘటనలే ఉదాహరణలు. ఇంట్లో పెంచుకొనే కుక్క, పిల్లి, కోళ్లు, ఆవులు, గేదెలు మనుషులతో మమేకమైపోతాయి. వాటికి మాటలు రాకపోయినా మనం అనురాగం కురిపిస్తే అర్థం చేసుకుంటాయి. కోళ్లు కూడా అంతే. సాధారణంగా కోళ్లను హింసా క్రీడ కోసం పెంచుతున్నా.. వాటిపై ఇంట్లో మహిళలకు ఎక్కువగా అనురాగం ఉంటుంది. కొందరు వాటికి ఏమైనా జరిగితే తల్లడిల్లిపోతారు. పందేలకు తీసుకెళ్లడానికి అనుమతించని మహిళలు కూడా ఉన్నారు. అందుకే కోడి పందేల్లో పురుషులే కనిపిస్తారు. పూర్వం మహిళలు కూడా పందేలను చూసి ఆస్వాదించేవారు. కానీ, కత్తి కట్టి హింస మొదలు పెట్టిన తర్వాత పందేలకు వాళ్లు దూరమయ్యారు.

### జంతు ప్రేమికులు ఆలోచించాల్సిందే..

ప్రతి ఏడాదీ మూడు రోజులపాటు వేలాది కోడి పుంజులను బలి తీసుకుంటున్న కోడి పందేలపై నిషేధం గట్టిగా అమలు చేయడం ఎలాగూ సాధ్యం కాదని చాలాసార్లు తేలిపోయింది.ఎందుకంటే ఈ ఏడాది సుమారు 100 బరులు వెలిశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మూడు రోజులు సుమారు 2 వేల వరకూ పుంజులు బలైనట్టు సమాచారం. అయితే కత్తి కట్ట కుండా డింకీ పందేలు వేసుకోవడంపై అవగాహన కల్పిస్తే మేలని కొందరు అంటున్నారు.కోడి పందేలను మళ్లీ మునుపటి మాదిరిగా కత్తులు కట్టకుండా ఆడేట్లు పందెంగాళ్లలో మార్పు తీసుకురావడానికి జంతు ప్రేమికుల సహా యంతో ప్రభుత్వాలు ప్రయత్నించాలి.కత్తి కట్టడంపై ఉన్న నిషేధాన్ని పక్కాగా అమలు చేసేట్లు చూడాలి. సంక్రాంతికి వారం ముందు నుంచీ హడావుడీ కా కుండా కొద్ది వారాల ముందు నుంచే పందెం పుంజులు పెంచుతున్న వాళ్లను గుర్తించాలి.కత్తులు తయారు చేస్తున్న వాళ్లకు కఠిన శిక్షలు విధించాలి. జనా లను చైతన్యం చేసే కార్యక్రమాలకు ఉపక్రమించాలి. కోడి పందేలను ఒక్క ఏడాది పక్కాగా అడ్డుకోగలిగితే మళ్లీ అసలుసిసలైన సరదా సంప్రదాయ క్రీడను ప్రజలకు అందించవచ్చని సామాజిక వాదుల ఉవాచ.




## నీకో దండం జగనా! మా సంగతి చూడు?



### ఒంటికాలిపై నిలబడి అంగన్‌వాడీల నిరసన

దేవరపల్లి, జనవరి 19: అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని గోపాలపురం నియోజకవర్గ అంగన్వాడీల నాయకురాలు టీపీ లక్ష్మి విమర్శించారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా శుక్రవారం 39వ రోజు దేవరపల్లిలో ఒంటికాలిపై నిరసన తెలిపారు. ప్రభు త్వం తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదని.. మా న్యాయమైన కోర్కెలు తీరే వరకు సమ్మె విరమించేదిలేదన్నారు. అంగన్వాడీల సమ్మెకు యూటీఎఫ్ నాయకులు మద్దతు పలికారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు, యూటీఎఫ్ నాయకులు పద్మకామేశ్వరి, కుమారి, టి.గంగాభవాని,గౌసియా,సావిత్రి,మంజు భార్గవి, శంకరుడు, ఓరుగంటి శివప్రసాద్ రాజు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడికి నిరసన సెగ

నిడదవోలు, జనవరి 19 : ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు బయటకు వచ్చి అంగన్‌వాడీలతో చర్చించాలంటూ అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిడదవోలు మునిసిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హాజరై ఛైర్మన్ చాంబర్‌లోకి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే బయటకు రావాలంటూ అంగన్‌వాడీలు అంతా ఒక్కసారిగా మునిసిపల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే 10 మంది అంగన్‌వాడీలు మాత్రమే లోపల చాంబర్‌లోకి అనుమతించి మాట్లాడే ప్రయత్నం చేశారు. దీనిపై అంగన్‌వాడీల యూనియన్ గౌరవ అధ్యక్షుడు జువ్వల రాంబాబు చాంబర్‌లోకి వెళ్లి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిని నిలదీశారు. ఇద్దరి మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనే సరికి పోలీసులు అంగన్‌వాడీలు, యూనియన్ నాయకుడు రాంబాబును బయటకు పంపించారు. ఎమ్మెల్యే తీరుపై అంగన్‌వాడీలు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ధవళేశ్వరం కార్యదర్శిపై జేసీ సీరియస్

### పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడమే కారణం

రాజమహేంద్రవరంరూరల్, జనవరి 19 : పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంలో పోలింగ్ కేంద్రాలను జేసీ తేజ్‌భరత్ శుక్రవారం పరిశీలించారు. ధవళేశ్వరం పంచాయతీ సమీపంలో ఓ పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంపై పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ బాలరాజులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్‌కు వెనుకాడేది లేదని తెలిపినట్టు సమాచారం. ఈ విషయమై డీపీవో జాన సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడగా ధవళేశ్వరం జూనియర్ అసిస్టెంట్, ఈవో సూరిబాబుల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

## 10 రోజుల పాటు కులగణన సర్వే

### 28 వరకూ 6,04,059 కుటుంబాల వివరాలు సేకరణ

రాజమహేంద్రవరం, జనవరి19(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కులగణన ప్రారంభమైనట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు.స్థానిక 10వ వార్డులో కులగణన నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 28వ తేదీ వరకూ మొత్తం పది రోజుల పాటు సర్వే జరుగుతుందన్నారు. జిల్లాలోని 512 సచివాలయాలు 8960 క్లస్టర్లలలో 6,04,059 కుటుంబాల కులగణన చేపడతామని చెప్పారు. 8781 మంది సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కులగణన చేస్తారన్నారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2 వరకూ 5 రోజుల పాటు ఆయా సచివాలయాల్లో డేటా అందుబాటులో ఉంచుతారని చెప్పారు. ప్రజలు నేరుగా వెళ్లి డేటా వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. డేటా ధ్రువీకరణ, ప్రక్రియను వచ్చే నెల 15వతేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. బయోమెట్రిక్ ఆధారిత నిర్ధారణ చేస్తున్నామని, ఎటువంటి లోపాలు లేకుండా కులగణన పూర్తిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలు, సందేహాలను తీర్చేలా ఎంపీడీవోలు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు.అధికారులంతా వారికి కేటాయించిన గ్రామాలు, వార్డుల్లో ప్రతి రోజూ పర్యటించాలని,సూపర్‌వైజర్లు ఫీల్డ్‌లోనే ఉండాలన్నారు.

# రా.. కదలిరా..!

## నేడు మండపేటలో చంద్రబాబు భారీ బహిరంగ సభ

▸▸ లక్ష మంది జన సమీకరణే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఏర్పాట్లు ▸▸ టీడీపీలో చేరనున్న వైసీపీ నేతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రా.. కదిలిరా.. ప్రభంజనంలా తరలిరా.. అంటూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం పార్లమెంటు స్థాయిలో మండపేట కేంద్రంగా శనివారం నిర్వహించే 11వ భారీ బహిరంగ సభకు తెలుగుదేశం, జనసేన సమాయత్తమవుతున్నాయి. భారీఎత్తున జనాన్ని తరలించడానికి నియోజకవర్గాల్లో ఇరు పార్టీల కేడర్లు పోటీపడుతున్నాయి. ఈ సభను విజయవంతం చేయడం ద్వారా టీడీపీ ఎన్నికల నగారాను ఇక్కడి నుంచే మోగించనుంది. కోనసీమ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేల సంఖ్యలో జనసమీకరణ చేయనున్నారు. ఇందుకోసం టీడీపీ నియోజకవర్గానికో పరిశీలకుడిని నియమించింది. వారితోపాటు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, టీడీపీ టిక్కెట్లు ఆశిస్తున్నవారు జనసమీకరణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండపేట-ఆలమూరు రోడ్డులోని బాబుఅండ్‌బాబు కన్వెన్షన్ హాలు పక్కన గల సభాస్థలిలో మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ప్రారంభం కానుంది. వేదికపై చంద్రబాబుతోపాటు సుమారు 72 మంది ఆశీనులయ్యేలా ఏర్పాట్లుచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ముగ్గురు పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జనసేన ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నేతలతోపాటు 18 విభాగాలకు చెందిన అనుబంధ సంస్థల అధ్యక్షులను వేదికపైకి ఆహ్వానించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహించనున్నారు. జన సమీకరణలో భాగంగా ప్రైవేటు వాహనాలు, కార్లతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల వారు మోటారు సైకిళ్లపై తరలివచ్చేందుకు వీలుగా టీడీపీ, జనసేన నేతలు కృషి చేస్తున్నారు. ఈ సభను పెద్దఎత్తున విజయవంతం చేసేందుకు టీడీపీ జిల్లా నాయకత్వంతోపాటు అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చంద్రబాబునాయుడు సమక్షంలో వైసీపీకి చెందిన కీలక నేతలు టీడీపీలో చేరనున్నారు. శెట్టిబలిజ యువనేత, అమలాపురం పట్టణానికి చెందిన వాసంశెట్టి సుభాష్ వేలాదిమంది అనుచరులతో అమలాపురం నుంచి భారీ ర్యాలీగా మండపేట వెళ్లి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరతారు. కాకినాడలో ప్రసిద్ధి చెందిన సత్య స్కాన్ సెంటర్ నిర్వాహకుడు కాదా వెంకటరమణ, మలికిపురం మండలం మోరికి చెందిన చింతా వీరభద్రరావులతోపాటు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు టీడీపీలో చేరతారని తెలిసింది.


బాబు సభ ఏర్పాట్లకు భూమిపూజ చేస్తున్న బండారు, వేగుళ్ల తదితరులు

### పర్యటన సాగేదిలా..

చంద్రబాబు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు విలేజ్‌లోని డుంబ్రిగూడ నుంచి శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బయల్దేరి కోనసీమ జిల్లా మండపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బహిరంగ సభాస్థలికి 3.15 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల వరకు సభలో పాల్గొంటారు. అనంతరం సభాస్థలి నుంచి బయలుదేరి బైపాస్ రోడ్డులోని హెలిపాడ్‌కు చేరుకుని అక్కడి నుంచి 5.05 గంటలకు బయలుదేరి రాజమహేంద్రవరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. విమానంలో బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వెళతారు.


మండపేటలోని చంద్రబాబునాయుడు బహిరంగ సభ జరిగే ప్రదేశంలో శుక్రవారం రాత్రి వేదిక ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



మండపేటలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దసంఖ్యలో నిర్మించిన టిడ్కో గృహాలు.. అవే భవనాలకు వైసీపీ రంగులు మార్చి వదిలివేయడంతో అధ్వాన దుస్థితి

## టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు మోక్షమేదీ

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

మండపేట, జనవరి 19: మండపేట పట్టణంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు నేటివరకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో వైసీపీ ప్రభుత్వం అందజేయలేదు. ఫేజ్1లో నిర్మించిన 4,064 గృహాల్లో ఇప్పటివరకు కేవలం 2,700 మందికి మాత్రమే ఇళ్లను అందించారు. మరో 1300 మందికి ఫేజ్1లో ఇవ్వాల్సి ఉంది. ఐదేళ్లగా లబ్ధిదారులు సొంతింటికోసం ఎదురుచూపులు చేస్తున్నారు. మరోపక్క ఫేజ్2లో నిర్మించిన 2 వేల గృహాలకు సంబంధించి పనులు పూర్తయినప్పటికీ మౌలిక వసతులు కల్పించకపోవడం, బ్యాంకు రుణాలు మంజూరుకాకపోవడం వంటి కారణాల వల్ల నేటికీ టిడ్కో గృహాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇప్పటికే ఆ గృహాల్లో ఉంటున్న వారికి మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క నిర్మాణం చేయకుండా కేవలం భవనాల రంగుల మార్చిన ప్రస్తుతం ప్రభుత్వం.. ఎప్పటికి మిగిలిన వాటిని వినియోగంలోకి తెలుస్తుందో చూడాలి.


గాడ్‌ను సత్కరిస్తున్న కాశీ వేద పండితులు


గాడ్ సమక్షంలో సత్కారం అందుకున్న గరికపాటి, సాహితీవేత్తలు

## హైందవ సనాతన ధర్మవ్యాప్తికి గాడ్ కృషి అభినందనీయం

టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాయవరం, జనవరి 19: హైందవ సనాతన ధర్మవ్యాప్తికి వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేస్తున్న కృషి అభినందనీయమని టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి 88వ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రసార భారతీ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో వేణుగోపాల దీక్షితులు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, సాగరఘోష కవి గరికపాటి నరసింహారావు, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, యర్రప్రగడ రామకృష్ణ తదితరులు మాట్లాడారు. హిందూ ధర్మ పరిరక్షణకు పీఠాధిపతులు, మఠాధిపతులు చేస్తున్న సేవలను కొనియాడడంతోపాటు మనిషి ధర్మపథంలో ఎలా నడవాలనేది రాముడు మనకు చూపాడన్నారు. అయోధ్యలో సీతారాముల ప్రతిష్ఠ సందర్భంగా రాముడి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలన్నారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ప్రసంగం చేస్తూ ప్రతి మనిషి దైవారాధన చేయడం ద్వారానే మానసిక ప్రశాంతత లభించడంతోపాటు చింతలు తొలగుతాయన్నారు. విజయదుర్గా విశిష్ట సేవా పురస్కారాన్ని అనపర్తికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యుడు తేతలి సత్యనారాయణరెడ్డి, మస్తానమ్మ దంపతులకు అందజేశారు. పీఠాధిపతి గాడ్‌కు తిరుమల, కాశీ, అన్నవరం దేవస్థానాల నుంచి తీసువచ్చిన ప్రసాదాన్ని అందజేసి వేదాశీస్సులు వేదపండితులు అందజేశారు. ప్రముఖ వస్త్రవ్యాపారి తుమ్మిడి రామ్‌కుమార్, జీఎస్ఎల్ అధినేత గన్ని భాస్కరరావు, వారణాశి శృంగేరి శంకరమఠం మేనేజర్ చల్లా అన్నపూర్ణప్రసాద్, వారణాశికి చెందిన ఆధ్యాత్మికవేత్త చల్లా జగన్నాథ శాస్త్రి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పిఠాపురం మండలం భోగాపురంలో నాటిక పోటీల్లో ప్రదర్శించిన రాత నాటికలోని ఓ దృశ్యం.. నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## భోగాపురంలో ముగిసిన జాతీయ నాటికల పోటీలు

పిఠాపురం, జనవరి 19: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. భోగాపురం కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా నాన్నా నేనొచ్చేస్తా(గుంటూరు) ఎంపికకాగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా రాత(వెలగలేరు), తృతీయ ప్రదర్శనగా అమృతహస్తం(గుంటూరు), ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా కొత్త తరం కొడుకు(కొండెవరం), ఉత్తమ రచనగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ఉత్తమ దర్శకుడిగా పి.శ్రీనివాసరావు, ఉత్తమ నటుడిగా ఎంవీ రాజర్షి, ఉత్తమ నటిగా అమృతవర్షిణి, ఉత్తమ ప్రతినాయకుడిగా వై.హరిబాబులు ఎంపికయ్యారు. వీరందరికీ కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తదితరులు నగదు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా జలదంకి సుధాకర్, ఎండీ ఖాజావలీ, యం.చిన్నారావులు వ్యవహరించారు. ఇక నాటికల పోటీలు చివరి రోజున ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. ఏడు అడుగులు కలిసి వేసి జంటలో ఎవరయినా ఎనిమిదో అడుగు వేయాలని ప్రయత్నిస్తే ప్రాణాంతకమవుతుంది. ఆలుమగలు మధ్య చిన్న చిన్న అంతరాలు ఉన్నా అర్థం చేసుకోవడం ద్వారా వాటిని సరిచేసుకుంటే ఆ బంధం కడదాకా ఉంటుందనే సందేశాన్ని ఇస్తూ హైదరాబాదుకు చెందిన జయా ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించి ఎనిమిదో అడుగు నాటిక సాగింది. మాడభూషి దివాకరబాబు రచించిన ఈ నాటికకు డాక్టర్ శ్రీజ సాధినేని దర్శకత్వం వహించారు. తాను పొందాల్సినవి మంచిగా పొందుతూ తిరిగి ఇవ్వాల్సిన వాటి విషయంలో మనిషి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న తీరుని వివరిస్తూ ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన వెలగలేరు ఆర్ట్ థియేటర్స్ కళాకారులు ప్రదర్శించిన రాత నాటిక ఆసక్తికరంగా సాగింది. మనిషికి కష్టం కలిగితే నా రాతింతే అనుకోవడం, సుఖం వస్తే మాత్రం రాతను వదిలేస్తాడనే ఈ నాటికను పి. శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు.


అయోధ్య రాముల వారికి కల్యాణ కొబ్బరి బొండాలను అందిస్తున్న రామారెడ్డి దంపతులు

## అయోధ్యకు మండపేట కొబ్బరి బొండాలు

మండపేట, జనవరి 19: అయోధ్యలో ఈనెల 22న జరిగే అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి సంబంధించి శ్రీరాములు వారికి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కేవీ రామారెడ్డి దంపతులు తయారుచేసిన కల్యాణ కొబ్బరి బొండాలను గురువారం అయోధ్యలో రామమందిర ట్రస్టు నిర్వాహకులకు అప్పగించామని రెడ్డి దంపతులు శుక్రవారం తెలిపారు. తాము భద్రాచలం రాముల వారి కల్యాణానికి బొండాలు అందిస్తున్నామని, ఇప్పుడు అయోధ్య రామమందిరానికి బొండాలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.


ట్వంటీ ఫస్ట్ సెంచరీ సంస్థతో ఎంవోయూ చేసుకుంటున్న నన్నయ అధికారులు

## గ్రూప్-2 పరీక్షల శిక్షణకు నన్నయ ఎంవోయూ

దివాన్‌చెరువు, జనవరి19: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గ్రూపు-2 పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీకి నన్నయ వర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం పునరుద్ధరించామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఎంవోయూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు గ్రూప్-2 పోటీపరీక్షలకు సంబంధించి శిక్షణ అందించేందుకు ట్వంటీఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ముందుకు వచ్చిందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.హైమావతిని సంప్రదించాలని కోరారు. విద్యార్థులను ఎంపికచేసి శిక్షణా తరగతులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. తొలుత రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వీవీవీ కృష్ణప్రదీప్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. సొసైటీ సీఈవో కె.ధరణి, సీనియర్ సివిల్స్ మెంటార్ బి.అభినవ్‌శ్రీకాంత్, నన్నయ విశ్వవిద్యాలయం ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.హైమావతి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ జి.నాగమణి

## నేటి నుంచి 24 వరకూ జాతీయ టెన్నిస్ పోటీలు

23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారుల రాక : ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్, జనవరి 19: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ టెన్నిస్ పోటీలు శనివారం ప్రారంభమై ఈనెల 24 వరకూ కొనసాగుతాయని పాఠశాల విద్య జోన్2 ఆర్జేడీ, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి డీఈవో జి.నాగమణి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్జేడీ మాట్లాడుతూ అండర్-19 పాఠశాల క్రీడా సమాఖ్య పురుషుల టెన్నిస్‌పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు వెల్లడించారు. పోటీలకు 23 రాష్ట్రాల నుంచి 109 మంది క్రీడాకారులు హాజరవుతున్నారన్నారు. పోటీల నిర్వహణ నిమిత్తం కాకినాడ డీఎస్ఏ, పాత ఎస్పీ కార్యాలయం వెనుక, డిమార్ట్ సమీపంలోని సింథటిక్ టెన్నిస్‌కోర్టులను ఫ్లడ్‌లైట్లతో సిద్ధంచేసినట్టు తెలిపారు. పోటీల నిర్వహణకు కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ ఇలాక్కియా ఆదేశాల మేరకు వివిధ కమిటీలను ఏర్పాటుచేశామన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు డీఎస్ఏలో పోటీలు ప్రారంభమవుతాయని పాఠశాల క్రీడాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. పోటీల నిర్వహణ నిమిత్తం రాష్ట్ర క్రీడాసమాఖ్య నిధుల నుంచి రూ.6 లక్షలు మంజూరుచేశామన్నారు. 46 మంది కోచ్‌లు, 100 మంది స్థానిక అఫీషియల్స్ పోటీల నిర్వహణలో పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో పాఠశాల క్రీడాసమాఖ్య కార్యనిర్వహణా కార్యదర్శి బీవీవీఎస్వీ ప్రసాద్, డీవైఈవోలు అర్జే డేనియల్‌రాజు, డి.సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, పీడీలు రంగారావు, రవిరాజు, బంగారాజు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. ఏపీ జట్టుకు క్రీడాదుస్తులను ఆర్జేడీ అందజేశారు.

### నమాజ్‌కని బయలుదేరి.. కానరాని లోకాలకు

కారు ఢీకొని చికెన్ వ్యాపారి మృతి


రామ్‌తుల్లా (ఫైల్)

కరప, జనవరి 19: ప్రతీరోజు మాదిరిగానే వ్యాపారం ముగించుకుని నమాజ్ చేసుకోవడానికి బయలుదేరిన ఒక వ్యక్తిని కారు ఢీకొనడంతో కానరాని లోకాలకు తరలిపోయాడు. కాకినాడ జిల్లా కరపలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన షేక్ రామ్‌తుల్లా(50) కొన్నేళ్ల కిందట కరప వచ్చి కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. స్థానిక స్వర్ణ థియేటర్ వద్ద ఇద్దరు కుమారులతో కలిసి చికెన్ షాపును నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వ్యాపారం ముగించుకుని పెనుగుదురు మసీదులో నమాజ్ చేసుకోవడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి రామ్‌తుల్లాను బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తన చికెన్‌షాపు సమీపంలోనే జరిగిన ఈ ప్రమాదంలో రామ్‌తుల్లా తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నవ్వుతూ, అందరితో కలుపుగోలుతనంగా ఉండే రామ్‌తుల్లా కళ్ల ముందే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో సహచర వ్యాపారులు షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేర్చినట్టు కరప ఎస్ఐ తుపాటి రామకృష్ణ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించామని, నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ చేపడతామని వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు మృతి



అడ్డతీగల, జనవరి19: అడ్డతీగల మండలం మళ్ళవరం మామిళ్ళ గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమవరం పంచాయతీకి చెందిన శరత్‌రెడ్డి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం శరత్‌రెడ్డి రాజమహేంద్రవరం నుంచి గురువారం రాత్రి తన స్వగ్రామం భీమవరం వెళుతుండగా మళ్ళవరం మామిళ్ల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో శరత్‌రెడ్డి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### సత్యదేవుడి సన్నిధిలో సాంస్కృతికశాఖ సంయుక్త కార్యదర్శి పూజలు

అన్నవరం, జనవరి 19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి నందూరి ఉమస్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

### నేడు నవోదయా ప్రవేశ పరీక్ష

పెద్దాపురం, జనవరి 19: జవహర్ నవోదయా ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న ప్రవేశపరీక్షను నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామని, 8506 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను రిజిస్ట్రేషన్ నంబర్ లేదా పుట్టినతేదీ ఆధారంగా నవోదయా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9441829056, 9441008830, 944756148, 9704248269 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సురేష్, చైర్మన్ శేషుమాధవ్

## రైతు వంగడాలు, హక్కుల పరిరక్షణపై వర్క్‌షాపు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 19: రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రంలో శుక్రవారం రైతు వంగడాలు, హక్కుల పరిరక్షణ అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. దీనికి ఐసీఏఆర్-సీటీఆర్ఐ డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్మెంట్ యూనిట్ చైర్మన్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వ్యవసాయ కళాశాల పీజేటీఎస్ఏయూ హైదరాబాద్ ప్రొఫెసర్ జె.సురేష్ విచ్చేశారు. అలాగే మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భారతిలక్ష్మి, ఎన్‌జీఆర్‌యూ వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం హెడ్ సి.శ్యాంరాజ్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.మాధవరావు, ఐఐఎంఆర్ రీసెర్చ్ స్టేషన్ పెద్దాపురం హెడ్ మునిరత్నం, డాక్టర్ జి.రామనందం, సీనియర్ శాస్త్రవేత్త కె.రవీంద్రకుమార్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం డాక్టర్ పి.లలిత కామేశ్వరి, వేమగిరి ఐసీఏఆర్-డీఎఫ్ఆర్ శాస్త్రవేత్తలు, వివిధ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, సీటీఆర్ఐ విభాగాల అధిపతులు, రైతులు, రైతు ఉత్పత్తిదారులు హాజరయ్యారు. మొక్కల రక్షణ, రైతులు హక్కుల అథారిటీ వంగడాల ప్రాముఖ్యతను, నూతన రైతు వంగడాలు అంశాలపై డాక్టర్ కె.సరళ మాట్లాడారు. ఎం.శేషుమాధవ్ సంస్థ పరివర్తన గురించి ప్రస్తావించారు. జియోగ్రాఫికల్ ఇండికేషనల్(జీ1) అనే అంశంపై చర్చించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

## రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై విజిలెన్స్ దాడులు.. కేసులు నమోదు

నమూనాలు లేబొరేటరీకి

రాజమహేంద్రవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు విక్రయించేవాళ్లు ప్రజారోగ్యం దృష్ట్యా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సురేశ్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం రాజానగరం మండలంలోని పలు రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లలో విస్తృతంగా ఆకస్మిక సోదాలు చేశారు. జగన్నాథపురం (జె.అగ్రహారం)లోని ఫుడ్ పిరమిడ్‌లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, స్టాంపింగ్‌లేని వేయింగ్ మిషన్, 44 టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లు, బిల్లుల్లో జీఎస్టీ నమోదు చేయకపోవడం గుర్తించామని ఎస్పీ తెలిపారు. జీఎస్ఎల్ సమీపంలోని హ్యాబిటేట్‌లో నిల్వ ఉన్న 21 సోయా సాస్ బాటిల్స్ గుర్తించామన్నారు. కేసు నమోదు చేయడంతోపాటు చికెన్ బిర్యానీ నమూనాలు సేకరించి ఫుడ్ లేబొరేటరీకి పంపించామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ 25శాతంలోపు ఉండాలని కానీ చాలా రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న నూనెలో పరిమితి మించుతోందన్నారు. నూనెను ఎక్కువసార్లు ఉపయోగించడం వల్ల హాని జరుగుతోందని, అది ప్రజారోగ్యానికి హానికరమన్నారు. రెస్టారెంట్లు, బార్లు, ఫుడ్‌సెంటర్లు, హోటళ్ల కిచెన్లు, పరిసరాలు కచ్చితంగా పరిశుభ్రంగా ఉండాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని కోరుతున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగవెంకట రాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, ఏవో భార్గవ మహేశ్, డీసీటీవో షబ్బీర్, ఎస్ఐ జగన్నాధరెడ్డి, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ

అనపర్తి, జనవరి 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అనపర్తి మండలంలోని కుతుకులూరులో మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. కుతుకులూరులో కర్రి వెంకట రామారెడ్డి తన తల్లితో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 15వ తేదీన గ్రామంలో జరిగే ముగ్గుల పోటీలు తిలకించేందుకు తన తల్లి వెళ్లడంతో ఇంట్లో బీరువాలో ఉన్న మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్టు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలియజేశారు.

## ఏజెన్సీ సమాచారం

### రా... కదలిరా.. కార్యక్రమానికి తరలిరండి

● టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సునీత

రంపచోడవరం, జనవరి 19: అరకులో శనివారం జరగనున్న రా... కదలిరా... కార్యక్రమానికి రంపచోడవరం నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తరలిరావాలని టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హాజరయ్యే సభను విజయవంతం చేయాలని శుక్రవారం రంపచోడవరంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో సునీత పిలుపునిచ్చారు. అరకులో జరిగే కార్యక్రమం కూడా విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.

### అంగన్‌వాడీల సత్యాగ్రహ దీక్ష



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

రాజవొమ్మంగి జనవరి 19: శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట అంగన్వాడీలు సత్యగ్రహ దీక్ష చేశారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా అంగన్వాడీ వర్కర్లు ఎండలోనే సత్యగ్రహ దీక్షలో కూర్చున్నారు. అంగన్వాడీల దీక్షకు శుక్రవారం గిరిజన సంఘం నేతలు మద్దతు తెలిపారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామరావు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ సమ్మె చేస్తుంటే వైసీపీ ప్రభుత్వం, అధికారులు సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు బెదిరింపులకు భయపడరన్నారు. సీఐటీయూ నాయకులు పి.రామరాజు, చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు, అంగన్వాడీ యూనియన్ నాయకులు చిన్నికుమారి, కె.వెంకటలక్ష్మి, ఎల్.సత్యవతి, రమణి, రత్నం, చిన్నములు, సుందరమ్మ, నాగమణి, రాధ, భవాని, రాజేశ్వరి, లక్ష్మి, వీరయమ్మ, వీరలక్ష్మి ఉన్నారు.

### మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా?



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**కూనవరం:** గత ప్రభుత్వ ఎన్నికల హామీలలో మహిళలకు ప్రత్యేకస్థానం కల్పిస్తానన్న ముఖ్యమంతి జగన్‌రెడ్డి మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు మండిపడ్డారు. గత 38రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది పోరాటం చేస్తుంటే కనీసం వారి సమస్యలవైపు ముఖ్యమంత్రి కన్నెత్తికూడా చూడటంలేదన్నారు. మాటతప్పం, మడమతిప్పమని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి ప్రతీ విషయంలోను మడమ తిప్పుతున్నారన్ని వారన్నారు. తమ హక్కుల సాధనకోసం తమ జీతాల పెంపుకోసం చేస్తున్న పోరాటానికి ప్రజలనుంచి పూర్తి మద్దత్తు వస్తుందన్నారు. కార్యక్రమంలో సిబిటియు నాయకులు పెంటయ్య, లలిత, అన్నపూర్ణ, అంజమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

### 39వ రోజుకు చేరిన అంగన్‌వాడీల దీక్ష

**అడ్డతీగల:** అంగన్‌వాడీల వారి న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారానికి 39వ రోజుకు చేరుకొంది. అంగన్‌వాడీలు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బైటాయించి తమ గోడును అంబేడ్కర్ విగ్రహానికి విన్నవించుకున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 28వేల గౌరవ వేతనం చెల్లించాలని తమకు ఎన్నికల ముందు ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### భద్రాచలంకు రామభక్తుల పాదయాత్ర



భద్రాచలంకు పాదయాత్రలో వెళుతున్న రామభక్తులు

మోతుగూడెం,జనవరి19: చింతూరు మండలం మోతుగూడెం అయోధ్యలో సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిచెందిన భద్రాచలం శ్రీ సీతారామ లక్ష్మణుల దర్శనార్థం మోతుగూడెం, సీలేరు, మంగంపాడు, ఒరిస్సా నుంచి 150మంది పాదయాత్రగా శుక్రవారం ఉదయం ఇంతలూరు వాగు నుంచి బయల్దేరివెళ్ళారు. పొల్లూరు నుంచి మోతుగూడెం చేరుకున్నారు. దారి పొడవునా శ్రీరామ భక్తులకు స్థానిక ప్రజలు అంబటి, బిస్కెట్స్, పళ్ళు, మజ్జిగ, పానకాలు అందజేశారు. ఈ కార్యక్రమం గురువులు శ్రీ సోమీన శివప్రసాద్ దివ్య ఆశీస్సులతోమూడు రోజులు పాటు పాదయాత్ర జరుగుతుంది. ఈ కార్యక్రమం భగవాన్ విశ్వనాధం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతుంది. భోజనంఅనంత రం పాదయాత్రగా చింతూరు బయల్దేరి అక్కడ నుంచి భద్రాచలం చేరుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి గణపతి ఆలయ కమిటీ, శ్రీ సద్గురు సాయిబాబా ఆలయ కమిటీ, నూకాలమ్మ తల్లిఆలయ కమిటీ సభ్యులు, పిటీ రామారావు, చంద్రశేఖర్, జాజులరత్నాకర్, తామర మూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ర్యాలీ

అడ్డతీగల, జనవరి19: మండల కేంద్రమైన అడ్డతీగలలో రాష్ట్ర యూటీఎఫ్ పిలుపుమేరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావలసిన పెండింగ్ బకాయిలు ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, డీఏ బకాయిలు కోసం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక దేవీసెంటర్‌లో రోడ్డుపై మోకాళ్లతో బైటాయించి బకాయిలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కోశాధికారి కృష్ణ, జిల్లా కార్యదర్శి తేజారావు, మంగరాజు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### గోవిందగిరి వెంకటేశ్వరుడి అభిషేక సేవ

రంపచోడవరం, జనవరి 19: మండలంలోని ఐ.పోలవరంలో వెలసిన గోవిందగిరి శ్రీవెంకటేశ్వరస్వామికి శుక్రవారం అభిషేకసేవ జరిపారు. ఆలయ వేద పండితులు సాయిరాం శర్మ వేద పారాయణం చేయగా అర్చకులు పార్థస్వామి, మణికంఠస్వామి అభిషేక సేవ జరిపించారు. ధర్మ ప్రచారసేవా భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంటకరమారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. అనంతరం శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

### ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

వరరామచంద్రాపురం, జనవరి 19 : మండలంలో గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధిహామీ పనులపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో డ్రామా పీడీ ఎం.శివయ్య ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. 11 గ్రామ పంచాతీలలో తనిఖీ బృందం పనులపై నిర్వహించిన పూర్తి సమాచారాన్ని పంచాయతీల వారీగా కార్యక్రమంలో తెలిపారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ ఈరెండేళ్లలో 8.53 కోట్ల రూపాయల ఉపాధి పనులు జరిగాయని తెలిపారు. 11 గ్రామ పంచాయతీలలో జరిగిన అవకతవకలపై ఉపాధి సిబ్బందికి రూ.20 వేలు అపరాధ రుసుం చెల్లించాలని పీడీ సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వాళ్ళ రంగారెడ్డి, ఎంపీడీవో ఆర్. ఫణీందర్‌రెడ్డి, ఏపీవో రాఘవయ్య, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

### నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

వై.రామవరం జనవరి 19: వై.రామవరం మండలం పి.ఎర్రగొండ గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నేడు నవోదయ ఆరవ తరగతి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో రెండువందల నలభై మంది పరీక్షలు రాయనున్నారని, విద్యార్థులు ఉదయం పది గంటలకే పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

### సర్పంచ్ కుంజం రాజామణికి మాతృ వియోగం

దేవీపట్నం, జనవరి 19: టీడీపీ నాయకురాలు దేవిపట్నం సర్పంచ్ కుంజం రాజామణి తల్లి కుంజం రామయ్యమ్మ(56) శుక్రవారం మృతిచెందారు. ఆమె కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాదపడుతున్నారు. చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఇందుకూరు పునరావాస కాలనీలో అంత్యక్రియలు నిర్వహించారు. రామయ్యమ్మ మృతిపట్ల పలువురు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు.

### జాతీయ సేవా పథకం ప్రారంభం

రంగంపేట, జనవరి 19 : మండలంలోని వడిశలేరులో శుక్రవారం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన బాపట్ల రావెస్ విద్యార్థినీలు జాతీయ సేవా పథకం కార్యక్రమం ప్రాంభించారు. డాక్టర్ ఎ.జె. సువర్ణలత, సీహెచ్ సంధ్యారాణి మాట్లాడుతూ ఈ పథకం ముఖ్యోద్దేశంను, ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమం వరుసగా ఏడు రోజులలో స్వచ్ఛభారత్, వైద్యశిభిరం, పశువైద్యశిభిరం, వంటి పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిషోర్, అచ్యుతరాజు, వ్యవసాయ కళాశాల విద్యార్థినీలు, రైతులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు సీఎంకు లేదు

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 19 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి లేదని అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటులో కూడా అవినీతికి పాల్పడిన ఘనత జగన్‌రెడ్డిదేనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి మండలం రామవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో దళితులను మభ్య పెట్టేందుకే అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు ఆర్భాటం చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో దళితులకు రక్షణ ఎక్కడుందని అన్నారు. దళితులకు రాజ్యాంగ బద్ధంగా అమలు కావాల్సిన 27 సంక్షేమ పథకాలు రద్దుచేసి అన్యాయం చేశారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేయడమే కాకుండా విదేశీవిద్యను కూడా దళితులకు అందకుండా చేశారన్నారు. టీడీపీ హయాంలో అంబేడ్కర్ పేరున ఏర్పాటుచేసిన విదేశీవిద్యకు నేడు ఉన్న పేరేమిటో గుర్తు తెచ్చుకోవాలని అన్నారు. దళితలకు అందాల్సి బ్యాక్‌లాగ్ పోస్టులు ఏమయ్యాయో చెప్పాలని అన్నారు. టీడీపీ హయాంలో 135కోట్లతో విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తే నేడు అదే విగ్రహం ఖర్చు 400కోట్లు ఎలా ఖర్చయిందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఎన్ని దళిత హత్యలు జరిగాయో, ఎన్ని అత్యాచారాలు, ఎన్ని దాడులు జరిగాయో ప్రజలు మరచిపోయారని అన్నారు. సమావేశంలో టీడీపీ దళిత నాయకులు నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

### రా కదలిరా సభను విజయవంతం చేయండి

మండపేటలో శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ సభకు అనపర్తి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు. శనివారం మధ్యాహ్నం అనపర్తి మండలం రామవరం నుంచి బైక్ ర్యాలీగా మండపేట తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామని మధ్యాహ్నం 1గంటకు నాయకులు కార్యకర్తలు రామవరం చేరుకుని అక్కడి నుంచి బైక్ ర్యాలీలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

### జగన్ దళిత ద్రోహి

● అంబేడ్కర్ సెంటర్ ధర్నాలో టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19: దళితుల జీవితాలతో ఆటలాడుతున్న సీఎం జగన్ దళిత ద్రోహి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు విమర్శించారు. కోడి కత్తి శ్రీనుకు బెయిల్ ఇచ్చి అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు ముందుగా విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కోడికత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ చేస్తున్నాడన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో దళితులను చాలా దారుణంగా అణగదొక్కారని, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి డోర్ డెలివరీ చేశాడని, మాస్కు అడిగిన డాక్టర్ సుధాకర్‌ను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. ఈ ధర్నాలో మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కోరుమిల్లి విజయశేఖర్, బొర్రా చిన్ని, రాయి అప్పన్నబాబు, కొమ్మర్తి బాబ్జి, కప్పల వెలుగుకుమారి, మామిడి శ్రీను, బూరా రమణ, రాచర్ల రమణ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీల ర్యాలీ

● అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 19: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శుక్రవారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండు సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వం తీరుపట్ల నిరసన తెలిపారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనాలు ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు. ఈ మేరకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి గోకవరం బస్టాండు సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మాణిక్యాంబ, కె.బేబీరాణి మాట్లాడారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన అంగన్వాడీల 24 గంటల దీక్షా శిబిరానికి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయకర్, షరీఫ్, సీపీఐ నాయకుడు నల్లా రామారావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు జోజి, టీఎన్‌టీయూసీ నాయకులు ఆదిబాబు, నీలి కిషోర్, కాంగ్రెస్ నాయకులు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు.

### జగన్ సర్కార్‌కు సవాల్‌గా అంగన్‌వాడీల ఉద్యమం

దివాన్‌చెరువు, జనవరి 19: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు చేస్తున్న ఉద్యమం జగన్ సర్కార్‌కు సవాల్‌గా మారిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐ.ఎఫ్.టి.యు)ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడానికి కనీస ప్రయత్నంచేయకపోవడంతో అంగన్‌వాడీలు అగ్గిమీద గుగ్గిలం అవు తున్నారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్ వాడీలు సమ్మె ప్రారంభించి నెలఅవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## నగరంలో అభివృద్ధి లేదు

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19: రాజమహేంద్రవరంలో అభివృద్ధి లేదని, అన్నీ అనాలోచిత పనులు, హంగులు ఆర్భాటాలేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 43వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కంటిపూడి వెంకటపద్మావతి, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కంటిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో పాటు జగన్ వైఫల్యాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతుల కన్నీటి వ్యథ చాటిన రైతే రాజు నాటిక

● శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శన

అనపర్తి, జనవరి 20 : ప్రస్తుత సమాజంలో రైతుల కన్నీటి వ్యధలను చెబుతూ అనపర్తి మండలం పొలమూరులో శారదా కళనికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన రైతే రాజు నాటిక ఆకట్టుకుంది. శుక్రవారంరాత్రి గ్రామంలోని డీఎస్ఆర్ గ్రౌండ్స్ కళావేదిక వద్ద రైతే రాజు సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కష్టాల ఊబిలో కూరుకుపోతూ ఆత్మహత్యలకు పాల్పడితే దేశం ఏమైపోతుందని ఎవరూ ఆలోచించడం లేదు. ఎన్నో బాధ్యతలు కష్టాల నడుమ ఆర్థిక ఇబ్బందులలో ఉన్నా వ్యవసాయం చేస్తూ దేశానికి అండగా నిలబడుతున్న కిరీటం లేని రైతే రాజు అంటూ సందే శాత్మకంగా సాగిన రైతే రాజు నాటిక ఆకట్టుకుంది. గ్రామానికి చెందిన తాడి సుబ్బారెడ్డి దర్శకత్వ పర్యవేక్షణలో ప్రదర్శించారు. నటీనటులు తాడి సుబ్బారెడ్డి, పి.శ్రీనివాస్, కె.రామారెడ్డి, శ్రీలేఖ, సీహెచ్ వెంకటకృష్ణారెడ్డి, జ్యోతి రాణిల నటన ఆకట్టుకుంది.ఈనాటికను చెరుకూరి సాంబశివరావు రచించారు.



రైతే రాజు నాటికలోని రసవత్తర సన్నివేశం

## వంట వండాలంటే మంట పెట్టాల్సిందే

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్‌రావు

రంగంపేట, జనవరి 19 : వంట ఉడకాలంటే మంట పెట్టాల్సిందే, ఆర్థిక బకాయిలు రావాలంటే పోరాటం చేయాల్సిందే నని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రూపస్‌రావు అన్నారు. రాష్ట్ర యూటీఎఫ్ శాఖ పిలుపు మేరకు శుక్రవారం రంగంపేటలో ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రంగంపేట, అనపర్తి, బిక్కవోలు మండలాల నాయకులు రం గంపేట సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ఎం.విజయగౌరి, నరసారెడ్డి, గోవింద్, లూథర్‌పాల్, వీర్రెడ్డి, ఐ.విజయబాబు, కె.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

### కోరుకొండలో యూటీఎఫ్ నిరసన ర్యాలీ

కోరుకొండ: ఉపాధ్యాయులు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని నోటికి నల్ల రిబ్బన్‌లు ధరించి యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కోరుకొండ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా కొంతసేపు ధర్నా చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు కోరుకొండ తాలూకా కేంద్రంలో గోకవరం, కోరుకొండ, సీతానగరం మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ఈ నిరసన ప్రదర్శన, ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ.శ్రీమణి, ప్రేమ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ మందపాక భాస్కర్, బీఎల్ రాజేష్ పి. త్రిమూర్తులు, పాపారావు, 3మండలాలకు చెందిన యూటీఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రంగంపేటలో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు



కోరుకొండలో యూటీఎఫ్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

### వీరుళ్లమ్మ జాతరలో చిన్నారి అదృశ్యం



అనపర్తి, జనవరి 19 : అనపర్తి వీరుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా తమ కుమారుడు తప్పిపోయినట్లు చిన్నారి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లాకు చెందిన పఠాన్‌హస్సేన్ ఆమె భర్త ఇద్దరి పిల్లలతో అనపర్తి వీరుళ్లమ్మ జాతరలో ప్లాస్టిక్ పూలు అమ్ముకునేందుకు వచ్చారు. ఈ క్రమంలో 17వ తేదీన తన 11 సంవత్సరాల కుమారుడు పఠాన్ సమీర్ కనిపించకుండా పోయాడు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం అనపర్తి పోలీ సులకు ఫిర్యాదు చేసింది. చిన్నారి తల్లి పఠాన్ హస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ తెలిపారు.

### జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి

గోకవరం, జనవరి 19: ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరో గ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి కోరారు. గోకవరంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమంలో ఆమె పాల్గొని జగనన్న సురక్ష ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కొమరం శ్రావణి, ఎంపీటీసీ మాజీ సభ్యులు బుజ్జి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రమణ, చినబాబు పాల్గొన్నారు.

### నెలాఖరులోగా ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తాం: ఎమ్మెల్యే రాజా

కోరుకొండ, జనవరి 19: అర్హత ఉన్న వారికి నెలాఖరులోగా ఇళ్ల స్థలాల పట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ప్రతి మంచి పనిని గ్రామాల్లో ప్రతిఒక్కరికీ వివరించి ఇచ్చిన ప్రతి హామీలు అమలుచేసి నిరూపించాలని ప్రజల్లోకి వెళ్లి ధైర్యం చెప్పాలని ఎమ్మెల్యే కార్యకర్తలు, నాయకులకు సూచించారు.

### అపూర్వ కలయిక

రాజానగరం, జనవరి 19: మండలంలోని నరేంద్రపురంలోని ఎంపీయూపీ, హైస్కూల్లో 2006-7 సంవత్సరంలో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత ఒక్కచోట చేరారు. వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు గతంలో చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో ఉత్సాహంగా గడిపారు. చదువుకున్న పాఠశాల, ఆనాటి ఉపాధ్యాయులతో గడిపిన అనుబంధాన్ని మరోమారు మననం చేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. భౌతికంగా తమ నుంచి దూరమైన ఉపాధ్యాయుడు, విద్యార్థినుల ఆత్మకు శాంతి చేకూరాలంటూ కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శివనాగరాజు, ఉల్లి శివ, ఎస్.వెంకటేష్, సుంకర మణికంఠ, ప్రగడ శ్రీనివాస్, ప్రగడ శివ, తదితరులు పాల్గొన్నారు.



విద్యాబుద్ధులు నేర్పించిన గురువులతో పూర్వ విద్యార్థులు

## సంస్కరణవాది వేమన

● ఘనంగా వేమన జయంతి



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌కేవీటీ కళాశాల అధ్యాపకులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 19: యోగి వేమన ఆధునిక భావ సంస్కరణవాది అని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ వై. స్వర్ణశ్రీ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగి వేమన జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో స్వర్ణశ్రీ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన అంధ విశ్వాసాలు, కుల, మత మూఢత్వాలపై ప్రజల్లో చైతన్యం నింపిన సంఘసంస్కర్త వేమన అని అన్నారు. సమాజంలోని ప్రతి సమస్యపై స్పందిస్తూ ప్రజల నాలుకలపై పదాలను, పద్యాన్ని పరుగులు పెట్టించారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డీవీ రమణమూర్తి, తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడారు. సభలో అధ్యాపకులు ఎస్.రాజ్‌కుమార్, పి.బాబూరావు, పల్లి సుధా, హితకారిణి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చిర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు. అలాగే రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య మాట్లాడుతూ వేమన ప్రజాకవి అని కొనియాడారు. వేమన పద్యాల్లో లోకనీతులు, సామాజిక చైతన్యం ఉంటాయన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు ఎంకేఎస్ ప్రసాద్, కె.సుధారాణి, వలంటీర్లు, లైబ్రేరియన్ విజయవేణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

### ఆవలో నిర్మించిన ఇళ్లను అమ్ముకున్నదెవరు!

● మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19: రాజమహేంద్రవరం రామకృష్ణా థియేటర్ వెనుక ఆవ ప్రాంతంలో ప్రభుత్వం కట్టిన ఇళ్లను రౌతు హయాంలో అమ్మించిందెవరో అందరికీ తెలుసునని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను పార్టీ మారి వెన్నుపోటు పొడిచానని వ్యాఖ్యానించిన రుడా చైర్మన్ అసలు వెన్నుపోటుదారుడని అన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ రెండుసార్లు అతనికి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచి బొమ్మన రాజ్‌కుమార్ సమక్షంలో వైసీపీలో చేరారని, అటుపై భరత్‌రామ్ వద్ద చేరడం, తన రాజకీయ జీవితాన్ని భరత్ సర్వనాశనం చేశాడని అనడం మరిచిపోయారా అని ప్రశ్నించారు. రౌతుకు రుడా చైర్మన్ పదవే మొదటి, చివరి పదవి అని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో బొమ్మన రాజ్‌కుమార్‌ను ఎలా దెబ్బతీశారో, రేపు భరత్‌రామ్‌ను అలాగే దెబ్బతీస్తారని అన్నారు. సమావేశంలో టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, షేక్ సుభాన్, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకీరామయ్య, ద్వారా పార్వతిసుందరి, కోరుమిల్లి విజయశేఖర్, మిస్కా జోగినాయుడు, అట్టాడ రవి పాల్గొన్నారు.

### మాల్ ప్రాక్టీస్‌లో పట్టుబడిన ఉక్రోషంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై విద్యార్థి దాడి

● పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రిన్సిపాల్

అనపర్తి, జనవరి 19: అనపర్తిలోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మరో కళాశాలకు చెందిన విద్యార్థి పరీక్ష రాస్తూ మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతూ పట్టుబడ్డాడు. ఉక్రోషం ఆపుకోలేని ఆ విద్యార్థి కళాశాల ప్రిన్సిపాల్‌పై దాడికి పాల్పడ్డాడు. దీనిపై అనపర్తి పోలీసులకు కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

### ప్రముఖ న్యాయవాది ఆనంద్వేల్ మృతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19: రాజమహేంద్రవరం గాంధీపురానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఆనంద్వేల్(95) శుక్రవారం మరణించారు. ఆయనకు భార్య డాక్టర్ శాంత, ఇద్దరు కుమారులు ఉన్నారు. బ్రిటీష్ కాలంలోనే బీఏ, బీఎల్ చదివిన పాత తరం సీనియర్ అడ్వకేట్‌గా ఆనంద్వేల్‌కు పేరుంది. పేదల కోసం ఆయన ఎన్నో కేసులు వాదించి గెలిచారు. ఆయన వద్ద శిష్యులుగా చేసిన ఎందరో జడ్జిలుగాను, న్యాయవాదులుగాను స్థిరపడ్డారు. ఆనంద్వేల్ అంత్యక్రియలు స్థానిక కోటిలింగాల కైలాస భూమిలో నిర్వహించారు. ఆయన మృతి పట్ల రాజమండ్రి బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం ప్రకటించారు.

### అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధికి 13.85కోట్లు మంజూరు

అనపర్తి, జనవరి 19 : అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం రూ.13.85కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అనపర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనపర్తి ప్రాంత వైద్య అవసరాలకు అనుగుణంగా ఇటీవల సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ఏరియా ఆసుపత్రిగా మార్పు చేశామన్నారు. ప్రస్తుతం 24మంది వైద్యులు సేవలందిస్తున్నారని వంద పడకల ఆసుపత్రికి మరిన్ని భవనాల ఆవశ్యకతను ముఖ్యమంత్రికి వివరించగా అభివృద్ధి కోసం రూ.13.85కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతండున్న భవనంపై మరో అంతస్థు నిర్మాణం, ఆసుపత్రి వెనుకభాగంలో నూతన భవనం నిర్మించనున్నామని అన్నారు.

### సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

| | |
|---|---|
| శ్యామల | : సైంధవ్ |
| సూర్యామినీ | : నా సామి రంగ |
| సూర్యాప్యాలస్ | : గుంటూరు కారం |
| స్వామి | : గుంటూరు కారం |
| శివజ్యోతి | : సైంధవ్ |
| అనుశ్రీ(సాయికృష్ణ) | : హనుమాన్ |
| రాజా | : హనుమాన్ |
| అశోక | : సలార్ |
| ఊర్వశి | : హనుమాన్ |
| రంభ | : నా సామి రంగ |
| మేనక | : హనుమాన్ |
| అప్సర | : గుంటూరు కారం |
| కుమారి | : హనుమాన్ |
| వీఎస్ మహల్ (నామవరం) | : హనుమాన్ |
| మురళీకృష్ణ(ధవళేశ్వరం) | : నా సామి రంగ |
| వెంకటసూర్య(కడియం) | : హనుమాన్ |
| సత్యగౌరి (అనపర్తి) | : గుంటూరు కారం |
| సూర్యశ్రీ (అనపర్తి) | : గుంటూరు కారం |
| ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం) | : గుంటూరు కారం |
| రామకృష్ణ(కోరుకొండ) | : సైంధవ్ |
| గీతాసినిమాస్ (సీతానగరం) | : సైంధవ్ |
| శ్రీనివాస (గోకవరం) | : సైంధవ్ |
| టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం) | : గుంటూరు కారం |
| లలితామహల్(రంపచోడవరం) | : సైంధవ్ |
| నవయుగ(చింతూరు) | : హనుమాన్ |





# విషాద యాత్ర

- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- కార్ టైర్ పేలి డివైడర్‌ను ఢీకొట్టిన వైనం
- అక్కడికక్కడే ముగ్గురు మృతి
- బిక్కవోలులో విషాదఛాయలు



అనకాపల్లి వద్ద టైర్ పేలి ప్రమాదానికి గురైన ఎర్టికా కారు..





ప్రమాదంలో మృతిచెందిన తోడికోడళ్లు సత్యవతి, కుమారి, మనవడు అభిరామ్

బిక్కవోలు, జనవరి 19 : దేవుడిని చూద్దామని వెళ్లి.. ఆ దేవుడి దగ్గరికే వెళ్లిపోయిన విషాద ఘటన ఇది.. బిక్కవోలు జువ్వలదొడ్డిలో నివాసం ఉంటున్న సోదరులు పోలిరెడ్డి సత్తిబాబు, శ్రీను షూమార్ట్ వ్యాపారం చేస్తున్నారు. పండుగ పూర్తయిన ఆనందంలో వీరిద్దరు కుటుంబీకులతో ఎర్టికా కారులో బుధవారం పలు ఆలయాలను దర్శించుకునేందుకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున అరసవిల్లి, శ్రీకూర్మం, సింహాచలం దైవ దర్శనాలు చేసుకుని తిరిగి వస్తుండగా అనకాపల్లి ఎక్స్‌ప్రెస్ రోడ్డు వద్ద కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న సత్యవతి(48), కుమారి (35), అభిరామ్ (3) అక్కడికక్కడే మృతి చెందారు. నిన్నటి వరకూ తమ మధ్యనే ఆనందంగా తిరుగుతూ కనిపించిన తోటికోడళ్లు, మనవడు ఇక లేరని తెలిసి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- వివరాలు మెయిన్‌లో..



## జై..శ్రీరామ్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఏవీ అప్పారావు రోడ్డు రామాలయం సెంటర్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం శ్రీరామ విజయయాత్ర నిర్వహించారు. బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ సత్యగోపీనాథ్ ప్రభుజీ సారథ్యంలో దానవాయిపేట నుంచి ఆల్‌కట్ గార్డెన్స్ శ్రీ గేదెల నూకరాజు కల్యాణ మండపం వరకూ యాత్ర సాగింది. యాత్రలో శ్రీరామనామ సంకీర్తనలతో పురవీధుల్లో ప్రజలు తన్మయత్వంతో పులకించారు. గరగలు, డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాట బృందాల భజనలు, కేరళ చండై వాయిద్యాలు, పౌరాణిక వేషధారణతో కళాకారులు సందడి చేశారు. యాత్రలో యాత్ర కన్వీనర్ తోట సుబ్బారావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, ఏపీఆర్ చౌదరి, అడబాల రామకృష్ణ, కాలెపు సత్యసాయిరాం, కె.హారిక, పొన్నాల సంతోషి, యానాపు యేసు, ఆదిరాజు సత్యనారాయణ, రామభక్తులు తదితరులు పాల్గొన్నారు.



దూబచర్లలో జరిగే బహిరంగ సభపై చర్చిస్తున్న టీడీపీ నాయకులు జవహర్, మండలపు రవి, బీవీఆర్ చౌదరి, ముద్దిపాటి తదితరులు

## 27న దూబచర్లకు చంద్రబాబు రాక

### లక్ష మందితో రా..కదలిరా బహిరంగ సభ

రాజమహేంద్రవరం,జనవరి19(ఆంధ్రజ్యోతి)/ కోరుకొండ : గోపాలపురం నియోజకవర్గం పరిధి నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో ఈ నెల 27న తెలుగుదేశం పిలుస్తుంది రా..కదలిరా.. భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్.జవహర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హాజరవుతారన్నారు.కోరుకొండ మండలం బూరుగుపూడిలోని రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో జరిగే సభకు జిల్లా నుంచి అత్యధికంగా పార్టీ కార్యకర్తలు, నేతలు, తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రా కదలిరా బహిరంగ సభలకు భారీగా జనం తరలి వస్తున్నారని.. ఈ సభకు కూడా జిల్లా నుంచి లక్ష మందికి పైగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివస్తారని అంచనా వేశారు. 27న ఉదయం 9 గంటలకే సభ ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే దూబచర్లలో సభా వేదిక స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి సభకు జనం హాజరవుతారన్నారు.దీనికి సంబంధించి భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభకు అనుమతులు, ఏర్పాట్లు, రూట్, పార్కింగ్ ప్లేసులు, హాజరయ్యే జనానికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు తదితర అంశాలపై నేతలు చర్చించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జోన్-2 ఇన్‌చార్జి మండలపు రవి, రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్.చౌదరి, గోపాలపురం ఇన్‌చార్జి ముద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ చౌదరి పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే హక్కు జగన్‌కెక్కడిది..

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19: అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు సీఎం జగన్‌కు లేదని మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా దళితులను దగా చేసిన జగన్ ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావిడిగా అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రారంభిస్తున్నాడన్నారు. ఇక అభ్యర్థులను మారుస్తున్న జగన్‌నే ప్రజలు మార్చబోతున్నారని చెప్పారు. గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి ముద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ దళితులు జగన్ పాలనలో మరొక 40 ఏళ్లు వెనక్కి పోయారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన 26 పథకాలను జగన్ నిర్వీర్యం చేశాడని మండిపడ్డారు. నా ఎస్సీలు అని పదేపదే చెప్పే జగన్ పూర్తిగా దళితుల సంక్షేమాన్ని విస్మరించాడన్నారు. ఇప్పుడు అతని పార్టీలో ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత వల్ల ఎక్స్ఛేంజ్ ఆఫర్ మాదిరిగా నియోజకవర్గాలు మారుస్తున్నాడన్నారు.ఒక చోట పనికిరానివాడు మరొక నియోజకవర్గంలో ఎలా పనికి వస్తాడని ప్రశ్నించారు.



రాజమహేంద్రవరంలో ఉపాధ్యాయుల నిరసన ర్యాలీ

## ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

### 24న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరంలో నిరసన ప్రదర్శన చేశారు. గోకవరం బస్టాండు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రాజ్యాంగం అమలయ్యేలా చూడాలని నినాదాలు చేశారు. కంబాలచెరువు పార్కు సెంటర్లో చెవిలో పువ్వులు, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బాకీ ఉన్న రూ.18 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయకపోతే ఈ నెల 24న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అలాగే ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ రాజమహేంద్రవరంలోనే రిలే నిరాహారదీక్షలు చేస్తామని వెల్లడించారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 25న విజయవాడలో ధర్నా చేపడతామన్నారు. జిల్లా కోశాధికారి ఎస్ఆర్ ప్రసాద్, రూపస్, జిల్లా కార్యదర్శులు రవిబాబు పాల్గొన్నారు.

# బరివెక్కిన.. గుండెలు!




- ప్రతి ఏడాదీ ఓడిపోతోన్న పుంజు
- బరిలో ప్రాణాలు బలిపెడుతున్న వైనం
- ఏడాదంతా ప్రేమగా పెంచి చివరిలో ఇలా
- మూగజీవాలపై యజమానుల కర్కశత్వం
- జిల్లాలో ఈ ఏడాది 100 బరులు
- 2 వేల పుంజులు బలైనట్టు సమాచారం
- గ్రామాల్లో పలువురు మహిళల మనోవేదన

నిన్నటి వరకూ మా మధ్యనే తిరిగింది.. చాలా చలాకీగా ఉండేది.. ఏం పెట్టినా తినేసేది.. ఇంటికి కాపలాగా ఉండేది.. ఎవరినీ ఇంటిలోకి రానిచ్చేది కాదు. గత నాలుగు రోజులుగా కనిపించకపోతే ఏదో వెలితి.. ఏం చేయాలో తోచడం లేదు.. ఇదీ ఒక పెద్దావిడ ఆవేదన..

తెల్లవారుజామునే మమ్మల్ని అందరినీ లేపేది.. ఎవరైనా లేవకపోతే మా చుట్టూ తిరిగేది.. పెట్టింది తిని మా మధ్యలో మసలేది. నాలుగు రోజులుగా ఎప్పుడు తెల్లారిందో తెలియడం లేదు.. ఎటు చూసినా అదే గుర్తొస్తుంది.. దాని కాలికి కట్టే తాడు కూడా అక్కడే ఉంది. ఏ లోకాన ఉందో పాపం.. ఇదీ ఒక మధ్య తరగతి మహిళ ఆక్రందన..

ఈ రెండు సంఘటనలు గోదావరి జిల్లాల ప్రేమను తెలియజేస్తున్నాయి కదా.. అవును మరి.. ఏడాదంతా ఎంతో ప్రేమగా పెంచుతారు.. సంక్రాంతి వచ్చిందంటే చాలు బలి జీవులుగా మార్చేస్తారు.. అవేనండి మన పందెం పుంజులు.. ప్రేమగా చూసినంత సేపు అంతే ప్రేమగా దగ్గరకు వస్తాయి.. యజమాని ఆదేశిస్తే బరిలో దిగుతాయి.. ఆ కొట్లాటలో అయితే విజయం లేదంటే వీరస్వర్గం.. ఇటీవల జరిగిన కోడి పందేల్లోనే సుమారు 2 వేల పుంజుల వరకూ మృత్యువాత పడినట్టు సమాచారం. ఆ పుంజుల యజమానులు నేటికి 'బరి'వెక్కిన గుండెలతో కన్నీటిని కంటిచాటున అదిమిపట్టుకుని ఆ పుంజుల జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చెట్లకు ప్రాణం ఉంటుందనేది పర్యావరణ ప్రేమికులు చెప్పే మాట.. అందుకే చెట్ల ఆకులను కోయడానికి ఇష్టపడరు..అలాంటిది తమ సరదాలకు చాలా మంది జీవం ఉన్న ప్రాణులను బలిస్తున్నారు. సంక్రాంతి పండుగ సరదా మాటున వేలాది మూగజీవాలు ప్రతి ఏడాదీ బరికి బలైపోతున్నాయి. వాటిని కావలి కాయడానికి ఎన్ని చట్టాలు ఉన్నా మూడు రోజులు మాత్రం మూగనోము పాటిస్తున్నాయి. ఆదేశాలు ముఖం చాటేయగా.. యంత్రాంగం కళ్లకు పాలకులు గంతలు బిగించేయడంతో ఏడాదంతా రాజభోగం చూసినా.. మూడు నిమిషాల్లో కత్తి వేటుకు రక్తం చిందించడం హింసా సంప్రదాయంగా మారిపోయింది. ఈ ఏడాదీ అదే జరిగింది. వారం ముందు నుంచీ బరులను ధ్వంసం చేయడం, కోడి పందేలపై పోలీసులు జూలు విదల్చడంతో ఈ సారి తమ ప్రాణాలకు ముప్పు లేదని పందెం పుంజులు సంబరపడ్డాయి. కానీ యథావిధిగా యుద్ధానికి వెళ్లి ప్రాణార్పణ చేయడం తప్పలేదు. ఇంటి వద్ద నుంచి ఠీవిగా వెళ్లిన పుంజు తిరిగి కుటుంబం చెంతకు చేరుకోలేదు.

### కత్తి కట్టిన హింసా సంప్రదాయం..

కోడి పందేల చరిత్ర ఈనాటిది కాదు. శాతవాహనుల కాలం నుంచీ ఈ క్రీడ వినోదాన్ని అందించేది. కావ్యాల్లో కూడా కోడి పందేలపై వర్ణన ఉంది. తొలిసారిగా కేతన తన దశ కుమార చరిత్రలో ఈ పందేలను ప్రస్తావించాడు. కోడి పుంజుల జాతి వైరం అనాధిగా మనుషుల పౌరుషాలకు ప్రతీకగా మారడం కాలక్రమేణా వాటి జాతికి ముప్పు తెచ్చింది. ప్రతి ఏడాదీ వేలల్లో కోడి పుంజులు ప్రాణాలు కోల్పోతున్నాయి. వాస్తవానికి కోడి కాలుకు కత్తి కట్టే పద్ధతి వచ్చిన నాటి నుంచే సరదా కోడి పుంజుల ఆట హింసాక్రీడగా మారి పోయి జూదం స్థాయికి చేరిపోయింది. పూర్వం డింకీ పందేల వల్ల పుంజుల ప్రాణాలకు పెద్దగా నష్టం ఉండేది కాదు. వాస్త వానికి కోడి పందేలు అటు పల్నాడు, ఇటు బొబ్బిలి ప్రాంతాల్లో పౌరు షానికి ప్రతీకగా నిలిచేవి. ఇప్పుడు సంక్రాంతి వచ్చిందంటే కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల్లోని వేలాది బరుల్లో లక్షలాది పుంజుల రక్తం ఏరులవుతోంది. 1178-1182 మధ్య జరిగిన పల్నాడు యుద్ధానికి కోడి పుంజులే కారణమని చరిత్ర చెబుతోంది. నాగమ్మతో కోడి పందెంలో ఓడిన బ్రహ్మనాయుడు ఏడేళ్లు పరదేశంలో ఉండాల్సి వచ్చింది. ఇద్దరు మనుషులు లేదా రెండు ఊళ్ల మధ్య వచ్చిన వైరాలను కూడా కోడి పుంజుల జాతి వైరం తీర్చేది. అప్పట్లో గెలుపునకే ప్రాధాన్యం ఇచ్చేవాళ్లు. కత్తి కట్టేవారు కాదు.దీంతో సమస్య పరిష్కారం అయ్యేది. మూగజీవాల ప్రాణాలకు ఇబ్బంది ఉండేది కాదు. గురజాల, మాచర్ల మధ్య గొడవను కోడి పందేలే తీర్చాయని చరిత్ర చెబుతోంది. రాజులు, జమిందారులు, సంస్థానాధీశులు వేడుకకు కోడి పందేలను నిర్వహించేవారు. సాధారణ ప్రజానీకం వినోదాన్ని మాత్రమే ఆస్వాదించేవాళ్లు. కోడికి కత్తి కట్టడం, వాటిపై డబ్బులతో పందేలు కాయడం వంటివి ఉండేవికావు. రానురాను కర్నాటక, తమిళనాడు, కేరళ, ఒడిశాలకు కూడా ఈ పందేలు పాకాయి.



బరిలో కొట్లాట

### 'బలి' జీవులు..

పందెం పుంజుకు ఏడాది పాటు రాజభోగం చూపిస్తారు. రోజూ వాటిని సాకడానికి ప్రత్యేకంగా పనోళ్లను ఏర్పాటు చేస్తారు. జీడిపప్పు, బాదం, చోళ్లు, గంట్లు, మేకమాంసం తదితర పదార్థాలతో తయారు చేసిన ఆహారాన్ని అందిస్తారు.గస(ఆయాసం) రాకుండా ఈత కొట్టిస్తారు. వేడి ఆవిరి పడతారు. నోటిలో నీళ్లు వేసుకొని వాటి ముఖంపై చిమ్మి హుషారు రప్పిస్తారు.మధ్య మధ్యలో మజాకు మందు పట్టిస్తారు.ఏడాదంతా ఎంతో ప్రేమగా సాకుతారు. అదే జీవితం కింద ఉంటారు. పండుగ వచ్చిందంటే పందెం పేరుతో బరిలో మూడు నిమిషాల్లో వాటి ప్రాణాలను తీసేస్తారు. ఏ కోడి పుంజు అయినా చావాల్సిందే.పందెం ఓడిపోయిన పుంజు ప్రాణాలు కోల్పోతుంది. ఒకవేళ బతికినా ఒంటినిండా దారుణమైన కత్తి పోట్లు ఉంటాయి. గెలిచిన పుంజుదీ అదే పరిస్థితి.ఒక పందెం కాకపోతే మరో పందెంలోనైనా పుంజు ప్రాణాలు తీసే వరకూ పందెంగాళ్లకు మనసు ఊరుకోదు. సంప్రదాయం మాటున జరుగుతున్న ఈ హింసా క్రీడపై జనాలు చైతన్యం కావాలని.. మూగజీవాలను హింసించి చంపేస్తూ ఆనంద పడడం క్రూరత్వమేనని జంతు ప్రేమికులు అంటున్నారు.

### మూగ జీవాలకూ అనుబంధం

క్రూర జంతువులైన సింహం, పులి కూడా వాత్సల్యం చూపిస్తే మచ్చిక అవుతాయి. మూగ జీవాలకూ ప్రేమానుబంధాలు తెలుసనడానికి అలాంటి ఘటనలే ఉదాహరణలు. ఇంట్లో పెంచుకొనే కుక్క, పిల్లి, కోళ్లు, ఆవులు, గేదెలు మనుషులతో మమేకమైపోతాయి. వాటికి మాటలు రాకపోయినా మనం అనురాగం కురిపిస్తే అర్థం చేసుకుంటాయి. కోళ్లు కూడా అంతే. సాధారణంగా కోళ్లను హింసా క్రీడ కోసం పెంచుతున్నా.. వాటిపై ఇంట్లో మహిళలకు ఎక్కువగా అనురాగం ఉంటుంది. కొందరు వాటికి ఏమైనా జరిగితే తల్లడిల్లిపోతారు. పందేలకు తీసుకెళ్లడానికి అనుమతించని మహిళలు కూడా ఉన్నారు. అందుకే కోడి పందేల్లో పురుషులే కనిపిస్తారు. పూర్వం మహిళలు కూడా పందేలను చూసి ఆస్వాదించేవారు. కానీ, కత్తి కట్టి హింస మొదలు పెట్టిన తర్వాత పందేలకు వాళ్లు దూరమయ్యారు.

### జంతు ప్రేమికులు ఆలోచించాల్సిందే..

ప్రతి ఏడాదీ మూడు రోజులపాటు వేలాది కోడి పుంజులను బలి తీసుకుంటున్న కోడి పందేలపై నిషేధం గట్టిగా అమలు చేయడం ఎలాగూ సాధ్యం కాదని చాలాసార్లు తేలిపోయింది.ఎందుకంటే ఈ ఏడాది సుమారు 100 బరులు వెలిశాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మూడు రోజులు సుమారు 2 వేల వరకూ పుంజులు బలైనట్టు సమాచారం. అయితే కత్తి కట్టకుండా డింకీ పందేలు వేసుకోవడంపై అవగాహన కల్పిస్తే మేలని కొందరు అంటున్నారు.కోడి పందేలను మళ్లీ మునుపటి మాదిరిగా కత్తులు కట్టకుండా ఆడేట్లు పందెంగాళ్లలో మార్పు తీసుకురావడానికి జంతు ప్రేమికుల సహాయంతో ప్రభుత్వాలు ప్రయత్నించాలి.కత్తి కట్టడంపై ఉన్న నిషేధాన్ని పక్కాగా అమలు చేసేట్లు చూడాలి. సంక్రాంతికి వారం ముందు నుంచీ హడావుడీ కాకుండా కొద్ది వారాల ముందు నుంచే పందెం పుంజులు పెంచుతున్న వాళ్లను గుర్తించాలి.కత్తులు తయారు చేస్తున్న వాళ్లకు కఠిన శిక్షలు విధించాలి. జనాలను చైతన్యం చేసే కార్యక్రమాలకు ఉపక్రమించాలి. కోడి పందేలను ఒక్క ఏడాది పక్కాగా అడ్డుకోగలిగితే మళ్లీ అసలుసిసలైన సరదా సంప్రదాయ క్రీడను ప్రజలకు అందివచ్చని సామాజిక వాదుల ఉవాచ.



దేవరపల్లిలో ఒంటి కాలిపై నిరసన



## నీకో దండం జగనా! మా సంగతి చూడు?

### ఒంటికాలిపై నిలబడి అంగన్‌వాడీల నిరసన

దేవరపల్లి, జనవరి 19: అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని గోపాలపురం నియోజకవర్గ అంగన్వాడీల నాయకురాలు టీపీ లక్ష్మి విమర్శించారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా శుక్రవారం 39వ రోజు దేవరపల్లిలో ఒంటికాలిపై నిరసన తెలిపారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదని.. మా న్యాయమైన కోర్కెలు తీరే వరకు సమ్మె విరమించేదిలేదన్నారు. అంగన్వాడీల సమ్మెకు యూటీఎఫ్ నాయకులు మద్దతు పలికారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు, యూటీఎఫ్ నాయకులు పద్మకామేశ్వరి, కుమారి, టి.గంగాభవాని,గౌసియా,సావిత్రి,మంజు భార్గవి, శంకరుడు, ఓరుగంటి శివప్రసాద్ రాజు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడికి నిరసన సెగ

నిడదవోలు, జనవరి 19 : ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు బయటకు వచ్చి అంగన్‌వాడీలతో చర్చించాలంటూ అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిడదవోలు మునిసిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హాజరై చైర్మన్ చాంబర్‌లోకి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే బయటకు రావాలంటూ అంగన్‌వాడీలు అంతా ఒక్కసారిగా మునిసిపల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే 10 మంది అంగన్‌వాడీలు మాత్రమే లోపల చాంబర్‌లోకి అనుమతించి మాట్లాడే ప్రయత్నం చేశారు. దీనిపై అంగన్‌వాడీల యూనియన్ గౌరవ అధ్యక్షుడు జువ్వల రాంబాబు చాంబర్‌లోకి వెళ్లి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిని నిలదీశారు. ఇద్దరి మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనే సరికి పోలీసులు అంగన్‌వాడీలు, యూనియన్ నాయకుడు రాంబాబును బయటకు పంపించారు. ఎమ్మెల్యే తీరుపై అంగన్‌వాడీలు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ధవళేశ్వరం కార్యదర్శిపై జేసీ సీరియస్

### పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడమే కారణం

రాజమహేంద్రవరంరూరల్, జనవరి 19 : పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంలో పోలింగ్ కేంద్రాలను జేసీ తేజ్‌భరత్ శుక్రవారం పరిశీలించారు. ధవళేశ్వరం పంచాయతీ సమీపంలో ఓ పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంపై పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ బాలరాజులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్‌కు వెనుకాడేది లేదని తెలిపినట్టు సమాచారం. ఈ విషయమై డీపీవో జాన సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడగా ధవళేశ్వరం జూనియర్ అసిస్టెంట్, ఈవో సూరిబాబుల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

## 10 రోజుల పాటు కులగణన సర్వే

### 28 వరకూ 6,04,059 కుటుంబాల వివరాలు సేకరణ

రాజమహేంద్రవరం, జనవరి19(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కులగణన ప్రారంభమైనట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు.స్థానిక 10వ వార్డులో కులగణన నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 28వ తేదీ వరకూ మొత్తం పది రోజుల పాటు సర్వే జరుగుతుందన్నారు. జిల్లాలోని 512 సచివాలయాలు 8960 క్లస్టర్లలో 6,04,059 కుటుంబాల కుటగణన చేపడతామని చెప్పారు. 8781 మంది సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కులగణన చేస్తారన్నారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2 వరకూ 5 రోజుల పాటు ఆయా సచివాలయాల్లో డేటా అందుబాటులో ఉంచుతారని చెప్పారు. ప్రజలు నేరుగా వెళ్లి డేటా వివరాలు తెలుసుకోవచ్చుని చెప్పారు. డేటా ధ్రువీకరణ, ప్రక్రియను వచ్చే నెల 15వతేదీ వరకూ నిర్వహిస్తారన్నారు. బయోమెట్రిక్ ఆధారిత నిర్ధారణ చేస్తున్నామని, ఎటువంటి లోపాలు లేకుండా కులగణన పూర్తిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలు, సందేహాలను తీర్చేలా ఎంపీడీవోలు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు.అధికారులంతా వారికి కేటాయించిన గ్రామాలు, వార్డుల్లో ప్రతి రోజూ పర్యటించాలని,సూపర్‌వైజర్లు ఫీల్డ్‌లోనే ఉండాలన్నారు.

# తూర్పుగోదావరి





## నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

గోపాలపురం, జనవరి 19: గోపాలపురం జడ్పీ హైస్కూల్లో నవోదయ ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహిస్తున్నట్టు చీఫ్ సూపరింటెండెంట్ టి.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30గం. నుంచి 1.30గం. వరకు జరిగే ఈ పరీక్షకు 262మంది విద్యార్థులు హాజరవుతారని, 11 గదులను సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. పరీక్షకు సర్వం సిద్ధం చేశామని, గంట ముందుగా హాల్‌టిక్కెట్లతో విద్యార్థులు హాజరుకావాలని సూచించారు.

## పొగాకులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

**దేవరపల్లి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి ప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి ప్రసాద్

దేవరపల్లి, జనవరి 19: వర్జీనియ పొగాకు తోటల్లో ఆకు రేల్చు, క్యూరింగ్, గ్రేడింగ్, యాజమాన్య పద్ధతులు పాటించాలని దేవరపల్లి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ అన్నారు. సంగాయిగూడెంలో పొగాకు రైతులకు శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పొగాకు గ్రేడింగ్‌లో అన్యపదార్థాలు కలవకుండా చూసుకోవాలని, క్యూరింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంటలో రసాయనిక అవశేషాలు లేని నాణ్యమైన పొగాకు పండించాలని, నాణ్యతను బట్టే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు పొగాకు బోర్డు గ్రోయర్ వెల్ఫేర్ ఫండ్ నుంచి ఒక్కొక్క రైతుకు రూ.10వేలు ఇవ్వనున్నట్టు ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, కంపెనీ ప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, సీతారామరాజు పాల్గొన్నారు.

## 'షర్మిలా నాయకత్వంలో కాంగ్రెస్ బలోపేతం'

పెరవలి, జనవరి 19: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలుగా షర్మిలా రెడ్డి ఈ నెల 21న విజయవాడలో ఆంధ్ర రత్న భవన్‌లో పదవీ బాధ్యతలు చేపడతారని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. ముక్కామలలో ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ షర్మిలా నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆమె ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు 21న విజయవాడ రావాలన్నారు.

## నేడు ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమావేశం

కొవ్వూరు, జనవరి 19: తణుకు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు డీఎస్సీ-1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘ నాయకుడు పి.బెనర్జి తెలిపారు. రెగ్యులరైజేషన్, 62 ఏళ్ల వయో పరిమితి పెంపు, పింఛను వంటి అంశాలపై సమావేశంలె చర్చిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని పేర్కొన్నారు.

## ప్రక్కిలంకలో కుల గణన సర్వే



ప్రక్కిలంకలో కుల గణన సర్వే చేస్తున్న దృశ్యం

తాళ్లపూడి, జనవరి 19: మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కుల గణన కార్యక్రమం ప్రక్కిలంక గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. జిల్లా మాస్టర్ ట్రైనీ జోడాల వెంకటేశ్వరరావు సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు పలు సూచనలు చేస్తూ కుల గణన జరిపే విధానాన్ని తెలిపారు. ప్రారంభంలోనే యాప్ పనిచేయక కొంత సేపు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నానికి యాప్ పనిచేయడంతో సర్వే ప్రారంభించారు. భార్యాభర్తలు వేరు వేరు కులాలైతే అలాగే నమోదు చేయాలని, ఇంటి స్వభావం, నీరు, మరుగుదొడ్లు, ఇంటి స్థలం వంటి 20 కాలమ్స్ అన్నింటినీ పూర్తి చేయాలని జోడాల తెలిపారు. ఎంపీడీవో వెంకటరమణ కొన్ని సచివాలయాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రా కార్యదర్శి దుర్గాప్రసాదు, వెల్ఫేర్ అసిస్టెంట్ కవిత, వలంటీర్లు పాల్గొన్నారు.

## చివటంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర

ఉండ్రాజవరం, జనవరి 19: మండలంలోని చివటం గ్రామంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రచార కార్యక్రమంలో భాగంగా వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను నాయకులు, అధికారులు వివరించారు. సదరు పథకాలను టీవీ ద్వారా ప్రజలకు చూపించారు. పథకాల క్యాలెండర్లను, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీఎస్‌కే రాజు, ఈవోపీఆర్డీ జేడీపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించిన వ్యవసాయాధికారులు

గోపాలపురం, జనవరి 19: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధికారుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికను శుక్రవారం రాజమహేంద్రవరంలో నిర్వహించారు. రాష్ట్రాధ్యక్షుడు బాలభాస్కర్, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా అనపర్తి ఏడీ డీవీ కృష్ణ, ఉపాధ్యక్షులుగా కోరుకొండ ఏడీఏ జీవీ మల్లికార్జునరావు, కార్యదర్శిగా నల్లజర్ల ఏవో కమల్‌రాజ్, ఉపకార్యదర్శిగా గోపాలపురం ఏవో రాజారావు, కోశాధికారిగా రామతులసిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వ్యవసాయాధికారి రాజారావు తెలిపారు. అనంతరం కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించి పూలమాలలతో సత్కరించినట్టు చెప్పారు.

## లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కొవ్వూరు, జనవరి 19: ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కర్ణాటక నుంచి కలకత్తా దూది లోడ్‌తో వెళ్తున్న లారీ శుక్రవారం ఉదయం కొవ్వూరు మండలం కాపవరం నేషనల్ హైవేలో ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత బోల్తా పడింది. డ్రైవర్ నిద్రమత్తులో ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో లారీ తిరగబడిందని సమాచారం. ఈ ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన లారీ డ్రైవర్ పి.కుమార్‌రాయ్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



చాగల్లు, జనవరి 19: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని వైసీపీ నాయకుడు గారపాటి శ్రీనివాసు అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణగూడెంలో జరిగిన మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీని వాస్‌ను క్రీడాకారులు సచివాలయ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నిర్మలాకుమారి, సర్పంచ్ జి.కుమారి, ఎంపీటీసీ జ్యోతి పాల్గొన్నారు.

# మొండి వైఖరి విడనాడాలి

- ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ
- 39వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల దీక్షలు



గోపాలపురంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

కొవ్వూరు, జనవరి 19: ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు గ్రాట్యూటీ చెల్లించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ డిమాండ్ చేశారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ 39 రోజులుగా సమ్మె చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కుటుంబాలను వదిలిపెట్టి రోడ్లపై దీక్షలు చేస్తున్నామని, క్రిస్టమస్, న్యూయర్, సంక్రాంతి పండుగలు సమ్మె శిబిరంలోనే చేసుకున్నామన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో ఎటువంటి మార్పు కనిపించడం లేదన్నారు. మంత్రి బొత్సా సత్యనారాయణ బడ్జెట్ ఉంది. కాని ప్రస్తుతం జీతాలు పెంచేది లేదని, జూలైలో పెంచుతామంటున్నారు. జూలైలో ఎంత పెంచుతారో జీవో విడుదల చేయాలన్నారు. అనంతరం ఐఎఫ్‌టీయు రాష్ట్ర కమిటీ అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్ రమేష్, పీవోడబ్ల్యు నాయకులు మంగతాయారు, మల్లిక మాట్లాడుతూ ఫ్యూడల్ మనస్తత్వంతో జగన్మోహనరెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తే అందుకు తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు వి.శ్రీదేవి, ఎన్.మదురవల్లి, ఎ.నరసమాంబ, ఎన్.శాంతకుమారి, కేసీ లక్ష్మి, పి.చైతన్య, సీహెచ్.బ్రహ్మమ్మ, బి.ఉష, ఎ.భ్రమరాంబ, పద్మ పాల్గొన్నారు.

**పెరవలి:** అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా పెరవలి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం కొనసాగించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**గోపాలపురం:** గోపాలపురంలో అంగన్వాడీలు దీక్షాశిబిరం నుంచి చెక్‌పోస్టు సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి అందించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె ఆపబోమని యూనియన్ మండలాధ్యక్షురాలు రామలక్ష్మి తేల్చి చెప్పారు.

**తాళ్లపూడి:** తాళ్లపూడిలో చేపట్టిన దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాలు పెట్టి తమ ఘనతను చాటుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలను కూడా ఆచరించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల పట్ల కనికరమైనా చూపని ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేస్తూ తమ నిరసన దీక్షలను కొనసాగించారు.

**దేవరపల్లి:** దేవరపల్లిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో నియోజకవర్గ అంగన్వాడీల నాయకురాలు టీవీ లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, 39 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వంలో ఏ మాత్రం కనికరం లేదని విమర్శించారు. షోకాజ్ నోటీసులు ఇచ్చి బెదిరిస్తున్నారని, ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు బెదరబోమని, తమ న్యాయమైన డిమాండ్లు తీర్చే వరకు సమ్మె విరమించబోమన్నారు. అంగన్వాడీల సమ్మెకు యూటీఎఫ్ నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో అంగన్వాడీ, యూటీఎఫ్ నాయకులు పద్మకామేశ్వరి, కుమారి, టీ.గంగాభవాని, గౌసియ్య, సావిత్రి, మంజు భార్గవి, శంకరుడు, ఓరుగంటి శివప్రసాద్ రాజు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



పెరవలిలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



కొవ్వూరులో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు



తాళ్లపూడిలో నిరవధిక దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు

# 27న రా కదలిరా సభను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు/కొవ్వూరు, జనవరి 19: ఈ నెల 27న గోపాలపురం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన రా కదలిరా బహిరంగ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి కోరారు. ఈ నెల 27న జరిగే చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం రాజమహేంద్రవరంలో టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాల ఇన్‌చార్జిలతో జోన్ టు కోఆర్డినేటర్ మందలపు రవి, జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించినట్టు వారు చెప్పారు. సమావేశంలో నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం పార్టీ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నామని చెప్పారు. సమావేశంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బొడ్డు వెంకటరమణచౌదరి, మద్దిపాటి వెంకట్రాజు, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వాసంశెట్టి సత్య తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న శేషారావు, ద్విసభ్య కమిటీ సభ్యులు

# నైతిక హక్కు సీఎం జగన్‌కు లేదు

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే

- జనసేన గోపాలపురం ఇన్‌చార్జి సువర్ణరాజు



దేవరపల్లిలో మాట్లాడుతున్న సువర్ణరాజు

దేవరపల్లి, జనవరి 19: అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు సీఎం జగన్‌కు లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. శుక్రవారం దేవరపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీలంటూ గొప్పలు చెప్పుకునే జగన్ వారికి చేసిందేమి లేదన్నారు. అంబేడ్కర్ ఎందరో మేధావులు, రాజకీయవేత్తలు, ఆర్థికవేత్తల సహకారంతో అత్యున్నతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించారన్నారు. జగన్ పాలనలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీలు అణచివేతకు గురయ్యారని అన్నారు. కరోనా కష్టకాలంలో మాస్కులు లేదని ప్రశ్నించినందుకు దళిత డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్రవేసి ఆయన మరణానికి కారణమయ్యారని, ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడైన తన డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరి చేసిన ఎమ్మెల్సీ పై చర్యలు తీసుకోకపోగా ముఖ్యమంత్రి చేరదీస్తున్నారన్నారు. కడపతో పాటు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో దళితులపై జరుగుతున్న దాడులకు జగన్ ఏ రోజు, ఏ విధంగానూ చర్యలు తీసుకోలేదని సువర్ణరాజు అన్నారు. ఇటీవల దొమ్మేరు, సీతానగరంతో పాటు అనేక చోట్ల దళితుల పై దాడులు జరిగాయన్నారు. జగన్ పాలనలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు 90శాతం దారి మళ్లించి దళితులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. సమావేశంలో జనసేన నాయకులు కాట్నం గణేష్, పోసిన గణపతి, అనిశెట్టి మధు, జీ.ప్రణీత్ పాల్గొన్నారు.

**నిడదవోలు:** నిడదవోలులోని సంత మార్కెట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాల నాయకులు నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పుట్టిన ప్రతిఒక్కరికి సమాన హక్కులు కావాలని పోరాడిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత సీఎం జగన్‌కు లేదన్నారు. దళితులను ఊచకోత కోసిన వారికి ఆశ్రయం కల్పిస్తూ దళితులను ఉక్కుపాదంతో అణచివేస్తున్న జగన్‌రెడ్డి.. అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో జువ్వల రాంబాబు, దొడ్డిగర్ల ప్రకాష్, అంబటి వెంకటరమణ, తూరుగోపు నాని, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.



నిడదవోలులో నల్లబెలూన్లతో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

## నేడు మండపేటలో రా కదలిరా సభ

- హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- ఏర్పాట్లు పరిశీలించిన తెలుగుదేశం, జనసేన నేతలు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, టీడీపీ నేతలు

మండపేట, జనవరి 19: టీడీపీ అధి నేత చంద్రబాబు శనివారం మధ్యాహ్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో రా కదలిరా బహిరంగ సభను నిర్వహించనున్నట్టు పార్టీ నేత లు చెప్పారు. ఆలమూరు రోడ్డులో జరిగే సభ ఏర్పాట్లను మాజీ మంత్రులు, నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి రవి, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన నేతలు వేగుళ్ల లీలాకృష్ణ, బండారు శ్రీనువాసరావు పరిశీలించారు. జన సమీకరణ, సభ ఏర్పాట్లపై చర్చించారు. ఈ బహిరంగ సభను ఎన్నికల శంఖారావ సభ కానుందని చెప్పారు. సభా ప్రాంగణమంతా పసుపుమయంగా మారింది. కాగా సభకు వచ్చే వాహనాలకు మండపేటలోని ఆలమూరు రోడ్డులో నాలుగు, బైపాస్ రోడ్డులో ఒకచోట పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు. బహిరంగ సభాస్థలి ఏర్పాట్లను ఎమ్మెల్యే వేగుళ్ల సారథ్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వల్లూరి సాయికుమార్ బాబు పర్యవేక్షిస్తున్నారు. అమలాపురం, రాజోలు, గన్నవరం, కొత్తపేట నుంచి వచ్చే వాహనాలకు ఆలమూరు రోడ్డులోను, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట నుంచి వచ్చే వాహనాలకు ఆలమూరు రోడ్డులో రెండు పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు.

### భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

మండపేటలో జరిగే బహిరంగ సభకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ చెప్పారు. శుక్రవారం బహిరంగసభా ప్రదేశాన్ని టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సభకు ఇద్దరు డీఎస్పీలు, అరుగురు సీఐలు, 23మంది ఎస్ఐలు, 66మంది ఏఎస్ఐలు, హెచ్‌సీలు, 201మంది కానిస్టేబుల్స్, 30 మంది రోప్‌పార్టీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## రైతు వంగడాల పరిరక్షణపై వర్క్‌షాప్

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 19: రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రంలో శుక్రవారం రైతు వంగడాలు, హక్కుల పరిరక్షణ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. దీనికి ఐసీఏఆర్-సీటీఆర్ఐ డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్మెంట్ యూనిట్ చైర్మన్ డాక్టర్ ఎం.శేషమాధవ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వ్యవసాయ కళాశాల పీజేటీఏస్ఏయూ హైదరాబాద్ ప్రొఫెసర్ జె.సురేష్ విచ్చేశారు. అలాగే మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.భారతి లక్ష్మి, ఎన్‌జీఆర్‌యూ వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం హెడ్ సి.శ్యాం రాజ్‌నాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.మాధవరావు, ఐఐఎంఆర్ రీసెర్చ్ స్టేషన్ పెద్దాపురం హెడ్ మునిరత్నం, డాక్టర్ జి.రామనందం, సీనియర్ శాస్త్రవేత్త కె.రవీంద్రకుమార్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం డాక్టర్ పి.లలిత కామేశ్వరి, వేమగిరి ఐసీఏఆర్-డీఎఫ్ఆర్ శాస్త్రవేత్తలు, వివిధ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, సీటీఆర్ఐ విభాగాల అధిపతులు, రైతులు, రైతు ఉత్పత్తిదారులు హాజరయ్యారు. మొక్కల రక్షణ, రైతులు హక్కుల అథారిటీ వంగడాల ప్రాముఖ్యతను, నూతన రైతు వంగడాలు అంశాలపై డాక్టర్ కె.సరళా మాట్లాడారు. ఎం.శేషమాధవ్ సంస్థ పరివర్తన గురించి ప్రస్తావించారు. జియోగ్రాఫికల్ ఇండికేషనల్(జి1) అనే అంశంపై చర్చించారు.

## రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై విజిలెన్స్ దాడులు

రాజమహేంద్రవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాలు విక్రయించే వాళ్లు ప్రజారోగ్యం దృష్ట్యా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని.. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సురేశ్ బాబు హెచ్చరించారు. శుక్రవారం రాజానగరం మండలంలోని పలు రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లలో విస్తృతంగా ఆకస్మిక సోదాలు చేశారు. జగన్నాథపురం(జె.అగ్రహారం)లోని ఫుడ్ పిరమిడ్‌లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, స్టాంపింగ్‌లేని వేయింగ్ మిషన్, 44 టేస్టింగ్ సాల్ట్ ప్యాకెట్లు, బిల్లుల్లో జీఎస్టీ నమోదు చేయకపోవడం గుర్తించామని ఎస్పీ తెలిపారు. జీఎస్ఎల్ సమీపంలోని హ్యాబిటేట్‌లో నిల్వ ఉన్న 21 సోయా సాస్ బాటిల్స్ గుర్తించామన్నారు. కేసు నమోదు చేయడంతోపాటు చికెన్ బిర్యానీ నమూనాలు సేకరించి ఫుడ్ లేబొరేటరీకి పంపించామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ 25%లోపు ఉండాలని కానీ చాలా రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న నూనెలో పరిమితి మించుతోందన్నారు. నూనెను ఎక్కువసార్లు ఉపయోగించడం వల్ల అలా జరుగుతోందని, అది ప్రజారోగ్యానికి హానికరమన్నారు. రెస్టారెంట్లు, బార్లు, ఫుడ్‌సెంటర్లు, హోటళ్ల కిచెన్లు, పరిసరాలు కచ్చితంగా పరిశుభ్రంగా ఉండాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని కోరుతున్నామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, ఏవో భార్గవమహేశ్, డీసీటీవో షబ్బీర్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# పీఆర్‌సీ విధివిధానాలు విడుదల చేయాలి

- యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు హుస్సే శంకరుడు
- దేవరపల్లి, కొవ్వూరులో నిరసన ప్రదర్శనలు




దేవరపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

దేవరపల్లి, జనవరి 19: ఉపాధ్యాయుల పీఆర్‌సీ విధి, విధానాన్ని వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు హుస్సే శంకరుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరపల్లిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక బకాయిలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నల్లరిబ్బన్లతో నిరసన దర్నా, తహశీల్దార్ కార్యాలయం నుంచి మూడురోడ్ల సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. హుస్సేశంకరుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఏపీజీఎల్ఐ రుణాలు చెల్లించాలని పీఆర్సీ ఏరియర్స్, డీఏ ఏరియర్స్ చెల్లించాలని, 12వ పీఆర్‌సీ విధివిధానాలు ప్రభుత్వం విడుదల చేయాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ మనోహర్‌కుమార్, దేవరపల్లి మండల కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా కార్యదర్శి నల్లజర్ల భవాని, నల్లజర్ల మండల కార్యదర్శి నాగేశ్వరరావు, దేవరపల్లి మండల కార్యదర్శి నాగేంద్ర కుమార్, బండి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

**కొవ్వూరు:** కొవ్వూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నాయకులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం మోటార్లసైకిళ్లపై బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసమూర్తి, ఆర్.సురేష్, పి.రవివర్మ, నారాయణరావు, మహేష్, వెంకట్రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

# విజయవాడ తరలిన దళిత నాయకులు

నల్లజర్ల, జనవరి 19: విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి నల్లజర్ల నుంచి వైసీపీ దళిత నాయకులు వెళ్లారు. శుక్రవారం సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి విజయవాడ వెళ్లారు. కార్యక్రమంలో మద్దిపాటి ప్రసాద్, గగ్గర శ్రీను, పల్లి సుబ్బారావు, బంకా అప్పారావు, దుర్గారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

**పెరవలి:** విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించిన సామాజిక సమతా సంకల్ప సభకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. పెరవలి నుంచి బయలు దేరే బస్సులకు ఎంపీపీ కార్చెర్ల సీతారామప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. నాయకులతో పాటు ఎంపీడీవో రమేష్, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాలరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నల్లజర్లలో బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న రమేష్



**దేవరపల్లి:** అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు గోపాలపురం నియోజకవర్గం నుంచి 20 బస్సుల్లో వెళ్లినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. దేవరపల్లి మండలం నుంచి ఆరు బస్సుల్లో వెళ్లారన్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి బస్సులు విగ్రహావిష్కరణకు తరలించారు.

**ఉండ్రాజవరం:** ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో మండలం నుంచి బస్సుల్లో సుమారు 250మంది విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి వెళ్లారు. ఈ సందర్భంగా వేలివెన్ను, ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల నుంచి బయలుదేరిన బస్సులకు జడ్పీటీసీ సభ్యుడు నందింగం భాస్కరరామయ్య, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, నాయకులు పాలాటి శరత్‌బాబు జెండాలు ఊపి పంపించారు.